


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 106 | గురువారం 16 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3



## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు..

ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం



# మహిళా బిల్లుకు ఓకే డీలిమిటేషన్ బిల్లుకు నో

## వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే



పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి



## నీటి భద్రత కోసం

# 'జలధార' యాక్షన్ ప్లాన్

ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన
జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు
రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు చర్యలు

రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

# ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి సంవత్సరంలో 77 శాతం
రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
ఫలితాల్లో అమ్మాయిలదే హవా

ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్ఠి కృషి వల్లే

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు
బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే
విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



## పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి



తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడం నా అదృష్టం
కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరంగా పాటుపడతా
చంద్రగిరి నా జీవితంలో టర్నింగ్ పాయింట్
మంత్రి లోకేశ్ వెల్లడి

తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను ఎంపిక చేయటాన్ని అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కష్టపడతానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గ కార్యకర్తల

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్..

## భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!



భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర
సరిహద్దుల్లో 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల పునరుద్ధరణ
భారత్‌లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్‌కు అదును
కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్

## దొంగల్లా ఎత్తుకెళ్లడం దేనికి?:

### పూడి శ్రీహరి అరెస్టుపై పేర్ని నాని నిప్పులు



పోలీసు వ్యవస్థ దిగజారడం శోచనీయమన్న పేర్ని నాని
జగన్ చుట్టూ ఉన్నవారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు
పర్యవసనాలను చంద్రబాబు అనుభవించక తప్పదని హెచ్చరిక

## జర్నలిస్టుగా పనిచేసిన శ్రీహరి ఏమైనా ఉగ్రవాదా?: సజ్జల

పూడి శ్రీహరి అరెస్టును ఖండించిన సజ్జల
సివిల్ డ్రెస్సులో వచ్చి అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపాటు
సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారని విమర్శ



# నా కారునే తనిఖీ చేస్తారా?



తన కారును కేంద్ర బలగాలు తనిఖీ చేసేందుకు ప్రయత్నించాయని మమత ఆరోపణ
టీఎంసీ నేతల వాహనాలనే ఎందుకు తనిఖీ చేస్తున్నారని ఎన్నికల సంఘంపై ఆగ్రహం
ప్రధాని, హోంమంత్రి కార్లను కూడా తనిఖీ చేస్తారా అని సూటి ప్రశ్న
కేంద్ర మంత్రులు డబ్బులు పంచుతున్నారని, ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్
కేంద్ర బలగాల వాహనాల్లో డబ్బు వస్తోందని సంచలన వ్యాఖ్యలు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేంద్ర బలగాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం కోల్‌కతా విమానాశ్రయానికి వెళుతుండగా, తన కారును తనిఖీ చేసేందుకు కేంద్ర బలగాలు ప్రయత్నించాయని ఆమె ఆరోపించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని ఇస్లాంపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత ఈ విషయంపై మాట్లాడారు. "ఈరోజు డం డం విమానాశ్రయంలో నా కారును తనిఖీ

# ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# నా కారునే తనిఖీ చేస్తారా?

చేయడానికి కేంద్ర బలగాలు వచ్చాయి. నేను తనిఖీ చేసుకోమని చెప్పాను. కానీ వారు భయంతో పారిపోయారు. నా కారును తనిఖీ చేస్తే నాకు సంతోషమే. నేను దొంగను కాదు, దోపిడీదారును కాదు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జీతంగా తీసుకోను" అని ఆమె అన్నారు. అంతేకాకుండా, "టీఎంసీ నేతల కార్లనే ఎందుకు తనిఖీ చేస్తున్నారు? ప్రధాని, హోంమంత్రి, బీజేపీ నేతల వాహనాలను ఎందుకు తనిఖీ చేయరు? ఈ ఎన్నికలు ఎందుకు ఇలా జరుగుతున్నాయి?" అని ఆమె ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు, వారి కుటుంబ సభ్యుల వాహనాలను తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని టీఎంసీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం గమనార్హం. పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య వాహనాలను కూడా తనిఖీ చేయాలని ఆదేశాల్లో ఉన్నట్లు టీఎంసీ మంగళవారం ఆరోపించింది. ఈ సందర్భంగా మమత మరిన్ని సంచలన ఆరోపణలు చేశారు. "కేంద్ర మంత్రులు డబ్బులు తీసుకొస్తున్నారు. కేంద్ర బలగాల వాహనాల్లో ఏం వస్తుందో నాకు తెలుసు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి కార్డులు పంచుతూ ఆర్థిక హామీలు ఇస్తున్నారని, ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

# దొంగల్లా ఎత్తుకెళ్లడం దేనికి?

వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్టుపై మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ నేతల కళ్లలో ఆనందం కోసం పోలీసు వ్యవస్థను ఇంతలా దిగజార్చడం శోచనీయమని మండిపడ్డారు. పూడి శ్రీహరి ఏమైనా నేరాలు చేశారా? అని ప్రశ్నించిన నాని, చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలనుకుంటే బహిరంగంగా అరెస్ట్ చేయాలి కానీ, దొంగతనంగా ఎత్తుకెళ్లడం ఏంటని నిలదీశారు. విలేకరి స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తిని ఉగ్రవాదిలా చిత్రీకరిస్తూ కంప్యూటర్లు, ఫోన్లు సీజ్ చేయడం దారుణమన్నారు. జగన్ చుట్టూ ఉన్నవారిని భయపెట్టాలనే కుట్రతోనే 20 నెలలుగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో, జగన్ వెంట జెండా మోసేవారిని ఆపలేరని స్పష్టం చేశారు. "శ్రీహరిని 15 రోజులు జైల్లో పెట్టగలరు, అంతకంటే ఏం చేయగలరు? జైలు నుంచి వచ్చాక ఆయన మళ్ళీ జగన్ కోసమే పనిచేస్తారు" అని అన్నారు. లోకేశ్ మాటలు విని పోలీసు వ్యవస్థను పతనావస్థకు తీసుకెళు తున్నారని, దీని పర్యవసానాలను చంద్రబాబు అనుభవించక తప్పదని హెచ్చరించారు. రాజకీయ కక్షల కోసం పోలీసులను వాడుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్టకట్టలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇప్పటికే చంద్రబాబుకు మంగళహారతి పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని చంద్రబాబు, లోకేశ్ లకు హితవు పలికారు. పోలీసులు కూడా అతిగా వ్యవహరించి భవిష్యత్తులో ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు.

# జర్నలిస్టుగా పనిచేసిన శ్రీహరి ఏమైనా ఉగ్రవాదా?: సజ్జల

వైసీపీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్టును ఆ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు అండ్ కో చెప్పినట్లుగా నడుచుకుంటోందని విమర్శించారు. పూడి శ్రీహరి అరెస్ట్ తీరుపై సజ్జల పలు ప్రశ్నలు సంధించారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, సివిల్ డ్రెస్సులో వచ్చి అక్రమంగా నిర్బంధించడం ఏంటని పోలీసులను నిలదీశారు. గతంలో జర్నలిస్టుగా పనిచేసిన శ్రీహరి ఏమైనా ఉగ్రవాదా? అని ప్రశ్నించిన ఆయన, కనీసం ఎఫ్ఐఆర్ కాపీలు కూడా ఇవ్వకుండా పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ అరెస్టుపై డీజీపీ తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులకు, అరెస్టులకు వైసీపీ భయపడదని సజ్జల స్పష్టం చేశారు. ఈ విషయంలో చట్టపరంగా పోరాటం చేస్తామని చెబుతూనే, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులపై భవిష్యత్తులో కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. "అందరినీ గుర్తు పెట్టుకుంటాం.. ఎవరూ తప్పించుకోలేరు" అంటూ పోలీసులను ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్...

జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్ఓసీ), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం. ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు. గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## సత్యసాయి జిల్లా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన ఘోర ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిలెటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్లు పేలిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం మనసుని కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగన్... గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, పేలుడు ధాటికి ఇళ్లు కూడా ధ్వంసమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పేలుడు పదార్థాల నిల్వపై ప్రభుత్వం కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, నిబంధనలు అతిక్రమించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడి, తగిన ఆర్థిక సహాయం అందించాలని సూచించారు.

# సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు..

### సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
### డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
### ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
### 20 మందికి తీవ్ర గాయాలు
### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం

శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## విశ్వాసం కోల్పోతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ.

ఇటీవలి కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు గమనిస్తే, ఒక ముఖ్యమైన సంకేతం స్పష్టంగా కనిపిస్తోంది. దేశాలు తమ సంపదపై మళ్లీ ప్రత్యక్ష నియంత్రణ సాధించాలనే తపన. ఫ్రాన్స్ తన బంగారం నిల్వలను అమెరికా నుండి వెనక్కి తీసుకువచ్చిందనే వార్త (అది పూర్తిగా నిజమో, అతిశయోక్తో వేరే విషయం) ఈ విస్తృత ధోరణికి ఒక ప్రతీకగా నిలుస్తోంది. ఈ పరిణామాన్ని కేవలం ఒక ఆర్థిక లావాదేవీగా కాకుండా, అంతర్జాతీయ విశ్వాస సంక్షోభం కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ద్వితీయ ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన బ్రేట్టంన్ ఊడ్స్ ఒప్పందం ( దీతీవ్‌శీఅ ఔశీశీండ ూస్త్రతీవవఎవత్ )ద్వారా అమెరికా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా మారింది. డాలర్ ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా స్థిరపడింది. ప్రపంచ దేశాలు తమ బంగారం నిల్వలను అమెరికాలో, ముఖ్యంగా "ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్" లో భద్రపరిచాయి. ఇది కేవలం భద్రత కోసం మాత్రమే కాదు; అమెరికా పై ఉన్న రాజకీయ, ఆర్థిక నమ్మకం వల్ల కూడా జరిగింది. కానీ గత రెండు దశాబ్దాలలో ఆ నమ్మకం క్రమంగా దెబ్బతింటోంది. ముఖ్యంగా 2008లో జరిగిన గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ అమెరికా ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలను ప్రపంచానికి బహిర్గతం చేసింది. భారీ బ్యాంకులు కుప్పకూలడం, ప్రభుత్వ రక్షణ ప్యాకేజీలు, నిరుద్యోగం పెరగడం , ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని కదిలించాయి. ఈ సంక్షోభం తర్వాత ప్రపంచ దేశాలు "అమెరికా ఎప్పటికీ స్థిరంగా ఉంటుంది" అనే భావనను పునఃపరిశీలించడం ప్రారంభించాయి. ఇక ఇటీవల కాలంలో అమెరికా ఆర్థిక విధానాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. భారీ రుణభారం, పెరుగుతున్న బడ్జెట్ లోటు, డాలర్‌పై అధిక ముద్రణ (మనీ ప్రింటింగ్) వంటి అంశాలు దీర్ఘకాలిక స్థిరత్వంపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఉదాహరణకు, అమెరికా ప్రభుత్వ ఋణం ట్రిలియన్ల డాలర్లకు చేరుకోవడం, దానికి వడ్డీ చెల్లింపులు కూడా భారీగా పెరగడం, ఇవి భవిష్యత్తులో డాలర్ విలువను దెబ్బతీసే ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. అంతేకాకుండా, అమెరికా తన ఆర్థిక శక్తిని రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కూడా ఒక ప్రధాన కారణం. రష్యా, ఇరాన్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం, వారి విదేశీ నిల్వలను ఫ్రీజ్ చేయడం వంటి చర్యలు ఇతర దేశాల్లో భయాన్ని కలిగించాయి. "ఈరోజు వారిపై, రేపు మనపై?" అనే ప్రశ్న చాలా దేశాల ఆలోచనల్లో చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే బంగారం వంటి భౌతిక ఆస్తులను తమ దేశంలోనే ఉంచుకోవాలనే అభిలాష పెరిగింది. ఈ ప్రక్రియను "గోల్డ్ రిపాత్రియేషన్" (గోల్డ్ రిపాత్రియేషన్) అని పిలుస్తారు. జర్మనీ, నెదర్లాండ్స్ , హంగేరి వంటి దేశాలు ఇప్పటికే తమ బంగారం నిల్వలను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చాయి లేదా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇది అమెరికా పై నమ్మకం పూర్తిగా పోయిందని చెప్పడం కంటే, "స్వీయ నియంత్రణ" వైపు ప్రపంచం అడుగులు వేస్తోందని చెప్పడం సరైనది. ఇప్పుడు ప్రశ్న, అమెరికా ఎకానమీకి నిజంగా ఏమైంది? అది కుప్ప కూలిపోతుందా? సరళంగా చెప్పాలంటే, అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలిపోతున్నది కాదు. కానీ అది ఒక మార్పు దశలో ఉంది. ఒకప్పుడు ప్రపంచానికి ఏకైక ఆర్థిక కేంద్రంగా ఉన్న అమెరికా, ఇప్పుడు బహుళ కేంద్రాల ప్రపంచంలో ఒక ప్రధాన కేంద్రంగా మారుతోంది. చైనా వంటి దేశాలు ఆర్థికంగా ఎదగడం, బ్రిక్స్ వంటి వేదికలు ప్రత్యామ్నాయ వ్యవస్థలను ప్రతిపాదించడం...మొదలైన అన్నీ కలిసి అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి. కానీ, అమెరికా డాలర్ ఇంకా ప్రపంచంలో ప్రధాన రిజర్వ్ కరెన్సీగానే ఉంది. దాని అధికారిక బెదిరింపులు అంతర్జాతీయ వాణిజ్యంలో, ముఖ్యంగా చమురు లావాదేవీలలో, డాలర్ ప్రాముఖ్యత కొనసాగుతోంది. కానీ అదే సమయంలో, కొన్ని దేశాలు తమ మధ్య వాణిజ్యాన్ని స్థానిక కరెన్సీల్లో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది డాలర్ ఆధిపత్యాన్ని క్రమంగా తగ్గించే ప్రక్రియ. ఫ్రాన్స్ బంగారం వెనక్కి తీసుకువచ్చిందనే వాదన పూర్తిగా నిజం అవునో, కాదో ఇంకా పూర్తిగా తెలియక పోయినా, అంతర్గత గుసగుసల (అండర్లయింగ్ మెసేజ్) సమాచారం మాత్రం స్పష్టంగా ఉంది. ప్రపంచ దేశాల్లో ఆందోళన మొదలైంది. ఈ దేశాలు ఇకపైనా ఒకే దేశంపై పూర్తిగా ఆధారపడదలచుకోవడం లేదు. ఆర్థిక భద్రతను విభజించుకోవడం, రిస్క్‌ను తగ్గించుకోవడం ప్రధాన లక్ష్యంగా మారింది. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. బంగారం నిల్వలు కేవలం ఆర్థిక భద్రతకు సూచిక మాత్రమే. అసలు శక్తి ఆర్థిక ఉత్పత్తి, సాంకేతిక ఆవిష్కరణలు, సైనిక శక్తి, రాజకీయ స్థిరత్వం వంటి అంశాల్లో కూడా ఉంటుంది. ఈ పరంగా చూస్తే, అమెరికా ఇప్పటికీ ప్రపంచంలో అగ్రస్థానంలోనే ఉంది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి కంపెనీలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ అదే సమయంలో, అసమానతలు పెరగడం, మధ్య తరగతి క్షీణించడం, రాజకీయ విభజనలు పెరగడం వంటి అంతర్గత సమస్యలు అమెరికా ఆర్థిక వ్యవస్థను లోపల నుంచి బలహీనపరుస్తున్నాయి. చివరిగా చెప్పాలంటే, బంగారం రిపాత్రియేషన్ అనే ఈ పరిణామం ఒక హెచ్చరిక. అమెరికా ఆర్థిక పతనం ప్రారంభమైందని కాదు, కానీ ప్రపంచం మారుతోందని సూచిస్తుంది. అమెరికా ఆర్థిక విధానాలపై విశ్వాసం క్రమంగా క్షీణిస్తుంది. భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థ బహుళ ధ్రువాల (మల్టీపోలర్) రూపంలో ఉండబోతోంది. ఇప్పటికే ఒక ప్రశ్న తలెత్తుతుంది. అది చివరకు మన ముందే నిలుస్తుంది. ఒకే దేశం ఆర్థిక శక్తిపై ఆధారపడే ప్రపంచం సురక్షితమా? లేక విభజిత, సమతుల్య వ్యవస్థ మరింత స్థిరమా? ఈ సమాధానం రాబోయే దశాబ్దాల ఆర్థిక రాజకీయాలను నిర్ణయిస్తుంది.

## ట్రంప్ ఆంక్షలు ముగియడానికి ముందు భారత్‌కు పెద్ద ఎత్తున ఇరాన్ చమురు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ఇరాన్ నుంచి భారత్‌కు దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు వచ్చింది. సుమారు ఏడేళ్ల తర్వాత ఇరాన్ నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తోంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను అమెరికా ఇటీవల తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నెల 19న గడువు ముగియనుండగా, దీనిని పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ చమురుపై విధించిన గడువు ఈ వారాంతంలో ముగియనున్నందున, భారత్ వ్యూహాత్మకంగా అంతకుముందే టెహ్రాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రపంచ ఇంధన కొరత, ధరల స్థిరీకరణ కోసం అమెరికా రష్యా, ఇరాన్ ముడి చమురు కొనుగోళ్లకు తాత్కాలికంగా అనుమతించింది. దీనితో ఇరాన్ నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్ చమురుతో నిండిన అతిపెద్ద ముడి చమురు రవాణా నౌక 'జయ' ఇప్పటికే భారత తూర్పు తీరంలోని పారాదీప్ వద్ద సరుకును దింపుతోంది.

# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్లను 2023లోనే అమలు చేయమని కోరాం. మా విజ్ఞప్తిని ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఓటమి నిర్ధారణ కావడంతో, అర్ధాంతరంగా ఈ బిల్లును ప్రవేశపెట్టాలని అధికార బీజేపి భావిస్తోంది. డీ లిమిటేషన్ ద్వారా నార్త్, ఈస్ట్, సౌత్, చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. లోక్‌సభ 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలి. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తాము' అని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు మేము వ్యతిరేకం కాదు. ప్రభుత్వం తెచ్చిన విధానమే తప్పు. రాజకీయ లబ్ది కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెరపైకి తెచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అస్సాం, జమ్మూ కాశ్మీర్‌లో జరిగినట్లే నియోజకవర్గాల విభజనలో అవకతవకలకు కేంద్రం యత్నిస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం చేయడానికే కేంద్రం సాకులు వెతుకుతోంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా విపక్షాలన్నీ ఐక్యంగా పోరాడతాయి' అని అన్నారు

# పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి

సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన యువనేత లోకేశ్ తొలిసారిగా తమ ప్రాంతానికి రావడంతో చంద్రగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఆయనను ముంచెత్తారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'ప్రత్యర్థులు బెదిరించినా భయపడకుండా తొడగొట్టి ఎన్నికల బరిలో నిలబడిన అంజిరెడ్డి తాత.. ప్రాణం పోతున్నా ప్రత్యర్థి పేరు తన నోట పలకని తోట చంద్రయ్య.. రక్తమోడుతున్నా పోలింగ్ బూతులో కూర్చున్న మంజులారెడ్డి నాకు స్ఫూర్తి. మీ అందరి త్యాగాల వల్లే 94 శాతం సీట్లతో ఈ రోజు మేమంతా ఇక్కడ కూర్చున్నాం. ప్రజలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలుం టాయని పాదయాత్రలో చెప్పా.. అదే ఇప్పుడు చేస్తున్నాం. మేం వారి మాదిరిగా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని అన్నారు. అభంశుభం తెలియని అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్య వంటి వారిని నిర్దాక్షిణ్యంగా పొట్టనబెట్టుకున్నారు. దోషులపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటున్నాం. మూడు రోజుల క్రితం దేవాలయానికి అడ్డుగా ఉన్న కారు తీయమని చెప్పినందుకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మనుషులు భక్తులపై దాడిచేశారు. భక్తులపై దాడిచేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. అటువంటి దుశ్చర్యకు పాల్పడేవారిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తన రాజకీయ జీవితాన్ని చంద్రగిరి నుంచే ప్రారంభించారు' అని అన్నారు. 'యువగళం పాదయాత్రలో చంద్రగిరి నాకు టర్నింగ్ పాయింట్. ఈ రోజు ఇక్కడే నా రాజకీయ పదోన్నతికి సంబంధించిన శుభవార్త విన్నాను. అందుకే చంద్రగిరి మాకు అచ్చివచ్చిన నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు. కార్యకర్తల కోసం సుమారు రూ.150 కోట్ల బీమా సొమ్ము వెచ్చించాం. గత ప్రభుత్వంలో కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులన్నీ ఎత్తేస్తాం. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చాలా వరకు క్లియర్ చేశాం. మిగిలినవి కూడా త్వరలో విడుదల చేస్తాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత మేం తీసుకుంటాం. కోటిమంది సభ్యులు గల అతిపెద్ద కుటుంబం తెలుగుదేశం అని అన్నారు. ఇంత పెద్ద కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు సహజం. నమ్మిన సిద్ధాంతం కోసం కేడర్ కలసికట్టుగా కష్టపడి పనిచేయాలి. అలిగి ఇంట్లో పడుకుంటే నష్టపోయేది మనమే. అధునాతన టెక్నాలజీతో ప్రతి కార్యకర్త చేసే పనిని ట్రాక్ చేస్తున్నాం. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను 'మై టీడీపీ యాప్' ద్వారా గుర్తించి, సముచిత స్థానం కల్పిస్తాం. చంద్రగిరి చెవిలో పువ్వుగా పేరొందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జగనే నమ్మడం లేదు. ఆయన చేతివాటం జగన్‌కు అర్థమైంది. మద్యంలో 600 కోట్లు కొట్టేశాడు. దేవుడి లడ్డూలు, వస్త్రాలను సైతం అమ్ముకున్నాడు. అటువంటి అవినీతిపరుడి నుంచి చంద్రగిరి ప్రజలకు విముక్తి లభించింది. ఎమ్మెల్యే పులివర్తి నాని నియోజకవర్గంలో పనుల కోసం మా వెంట పడుతుంటారు. గత 22 నెలల్లో నియోజకవర్గంలో రూ.900 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. చంద్రగిరికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది. చిన్నచిన్న సమస్యలను పక్కనబెట్టి టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ కలసికట్టుగా ప్రత్యర్థులపై పోరాడాలని అన్నారు.

## మహిళా బిల్లుకు ఓకే - డీలిమిటేషన్ బిల్లుకు నో

ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఖఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# నంద్యాల 32 వ వార్డులో రూ. 2.82 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 15 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణ పరిధిలోని 32 వ వార్డు (బొమ్మల సత్రం)లో భారీ ఎత్తున చేపట్టిన అభివృద్ధి పనులకు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నంద్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని తెలిపారు . 32 వ వార్డులో గత కొంతకాలంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, రూ. 2.5 కోట్లతో పటిష్టమైన సిమెంటు రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తున్నామని . అలాగే రాకపోకలకు ఇబ్బంది లేకుండా రూ. 32 లక్షలతో కల్వర్టును కూడా మంజూరు చేశామన్నారు. ఈ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదని . అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని . కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పనులు చేసి చూపిస్తున్నామన్నారు. వార్డు ప్రజలు కూడా అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, 32వ వార్డు టిడిపి ఇంచార్జి కొండ శ్రీనివాస్ యాదవ్ , బూతు ఇంచార్జ్ పోల్ రెడ్డి , మిద్దె ఉసేని, ప్రసాద్ , సుబ్బయ్య, మహమ్మద్, రాజేంద్ర, రమణ, మరియు ఆర్ అండ్ బి , రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్థానిక టీడీపీ నాయకులు , పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రముఖ మేకప్ కళాకారుడు,నంది అవార్డు గ్రహీత రామబ్రహ్మం ఆచారి మృతి.

**రామబ్రహ్మం ఆచారి మృతి కళా రంగానికి తీరని లోటు: కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ**

**5 దశాబ్దాలుగా నంద్యాలలో విక్టోరియా రీడింగ్ రూమ్ దగ్గర శ్రీరామ డ్రస్ కంపెనీ నిర్వాహకులు.**



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 15 ( నంది పత్రిక )** కళారాధన సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక సభ్యుడు, నంద్యాల శ్రీరామ డ్రస్ కంపెనీ నిర్వాహకుడు,మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగు పద్య పౌరాణిక నాటకానికి విశిష్ట సేవలు అందించిన మేకప్ కళాకారుడు రామబ్రహ్మం ఆచారి ఇటీవల అనారోగ్యానికి గురై మంగళవారం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగింది. గోపవరం గ్రామానికి చెందిన రామబ్రహ్మం ఆచారి మరియు తండ్రి శ్రీనివాస చారి, బాబాయ్ రామయ్య చారి, సోదరుడు బాలబ్రహ్మం ఆచారి శ్రీరామ డ్రస్ కంపెనీ ద్వారా అనేక దశాబ్దాలుగా పద్య నాటక రంగానికి విశేష మైనటువంటి సేవలు అందించారు. 53 సంవత్సరాల వయసులోనే అకాల మృతి చెందిన రామబ్రహ్మం ఆచారి ఉత్తమ మేకప్ కు నంది పురస్కారం, కందుకూరి జిల్లా స్థాయి రంగస్థల పురస్కారం రాష్ట్ర ప్రభుత్వం నుండి అందుకున్నారు. వెంకటాచలం కాలనీలో ఉన్న రామబ్రహ్మం ఇంటి వద్ద కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ , కళారాధన సాంస్కృతిక సంస్థ సభ్యులతో కలిసి రామబ్రహ్మం పార్థివ శరీరానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రామబ్రహ్మం ఆచారి నంద్యాల కళారాధన, కడప సవేరా ఆర్ట్స్,కర్నూలు లలిత కళా సమితి, రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక నాటక, సాంస్కృతిక సంస్థలు ప్రదర్శించిన వేలాది పౌరాణిక పద్య నాటకాలకు,చారిత్రక నాటకాలకు అవసరమైన తెరలు కట్టడం,మైకులు, లైటింగ్ ఏర్పాటు చేయడం, పాత్రలకు అవసరమైన దుస్తులు,ఆభరణాలు సమకూర్చి,రంగస్థలం అలంకరణ చేసి,పాత్రోచితంగా ఆహార్యం ( మేకప్) అందించిన రూపశిల్పిగా చేసిన కళా సేవలు కళాకారుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలలో రవీంద్ర భారతి హైదరాబాదులో ప్రదర్శించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్ర ,నిజామాబాద్ లో ప్రదర్శించిన రావణ ధాన్యమాలి, పార్వతీ పరిణయం వంటి నాటకాలకు పాత్రల రూపశిల్పిగా అద్భుతమైన మేకప్ అందించి ఆయా నాటకాలు విజయవంతంగా ప్రదర్శించడానికి దోహదం చేసిన కళాకారుడు రామబ్రహ్మం ఆచారి అని డాక్టర్ రవి కృష్ణ తెలిపారు. ఈ నాటకాలు కేవలం నంది నాటకోత్సవాలలోనే కాకుండా రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ప్రదర్శనలు ఇచ్చిన సమయంలో వీరు అందించిన కళా సేవలు మరువలేనివన్నారు. రామబ్రహ్మం మృతి కళా రంగానికి ముఖ్యంగా పౌరాణిక పద్య నాటకానికి తీరని లోటుగా మిగిలిపోతుందన్నారు. రామబ్రహ్మం ఆత్మకు శాంతి కలగాలని,వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆ నటరాజును కళారాధన ప్రార్థిస్తున్నదని తెలిపారు. బుధవారం నంద్యాలలో నిర్వహించిన అంత్య క్రియలలో అధిక సంఖ్యలో హాజరైన కళాకారులు అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు.

# పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించండి

**మెరుగైన సేవలు అందించి, ప్రజల నుండి సానుకూల స్పందన శాతాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టండి**

**ప్రభుత్వ వక్ఫ్, ఎండోమెంట్ భూముల సంరక్షణపై కట్టుదిట్టమైన చర్యలు**

**జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి.**



**కర్నూలు, నంది పత్రిక.....**పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో పీజీఆర్ఎస్, రెవెన్యూ జనరేషన్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను చూడాలని క రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీ పై వెంటనే స్పందించి నాణ్యత కలిగిన పరిష్కారం చూపించి ప్రజలలో విశ్వాసాన్ని పెంచాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించి ప్రజల నుండి సానుకూల స్పందన శాతాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా సాధించిన ఆదాయ వృద్ధిని అభినందిస్తూ, 104 శాతం ఆదాయం సాధించడం ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే కోడుమూరు, కల్లూరు, కర్నూలు మండలాల్లో ఆదాయం తక్కువగా ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి ఆదాయం పెంపు దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజిస్ట్రేషన్ అధికారులకు సూచించారు. అదే విధంగా వక్ఫ్ బోర్డు భూములు, ఎండోమెంట్ భూములు, ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కలెక్టర్ రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. భూముల ఆక్రమణలను నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా అధికారులందరిలో ా=ా (సబ్ రిజిస్ట్రార్) కర్నూలు పనితీరు బాగోలేదని, క ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం లేదని, లాగిన్ లో వచ్చిన అర్జీలను క్రమం తప్పకుండా చూడడం లేదన్నారు. ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఉండటం చాలా ముఖ్యమని, ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదని కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను హెచ్చరించారు..సమావేశంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారి బజారి, సబ్ రిజిస్ట్రార్లు, పాల్గొన్నారు.

## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈరోజు నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.



# ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో టాపర్లుగా నిలిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు.









**బేతంచెర్ల ఏప్రిల్ 15 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం గౌరుమానుకొండ మోడల్ స్కూల్ విద్యార్థులు, నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో మంచి ఫలితాలను సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 971 మార్కుల సాధించిన గంగుల కళ్యాణి మండల టాపర్ గా నిలిచారు. ఎం.పీ.సీ. నుంచి 925 మార్కులతో ఎస్.శీర్షిక లక్ష్మి అత్యధిక మార్కులు సంపాదించింది. ద్వితీయ సంవత్సరం సీ.ఈ.సీ. లో 796 మార్కులతో జి.సరిత ప్రథమ స్థానంలో నిలిచారు. అదే విధంగా మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఎం.పీ.సీ.లో 445 మార్కులు సాధించిన వి.సుచందన మొదటి స్థానంలో నిలువగా, బై.పి.సి. 429 మార్కులతో మున్నాజ షేక్, ఎం.ఇ.సి.లో 437 మార్కులతో బోయిని స్నేహలత ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ మరియ దాస్ తెలియజేశారు. విద్యార్థులు మంచి ఫలితాన్ని సాధించడం పట్ల ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

# 2 వ విడత సెన్సెస్ ట్రైనింగ్ కార్యక్రమం.



**బేతంచెర్ల ఏప్రిల్ 15 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయం నందు 2 వ విడత సెన్సస్ ట్రైనింగ్ కార్యక్రమం ను బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగమణి బుధవారం నాడు ప్రారంభించారు.ఈ ట్రైనింగ్ లో సంబంధిత అధికారులు మరియు సిబ్బందికి సెన్సస్ నిర్వహణ విధానాలపై అవగాహణ కల్పించ బడినది. కనుక ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు.

# ఇంటర్ ఫలితాలలో లోహిత టాపర్



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 15:** బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో చదువుతున్న మధులోహిత ఇంటర్ ఫలితాలలో టాపర్గా నిలిచింది. బైపిసి విభాగంలో 98 మార్కులతో టాపర్గా నిలిచిందని ప్రిన్సిపాల్ సయ్యద్ ఆబుదుర్ రఫీ తెలిపారు. ప్రథమ ఏడాదిలో 84.7 ద్వితీయ ఏడాదిలో 92 శాతం ఉత్తీర్ణత నమోదయిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీలో 969 మార్కులు, సీఈసీ లో 932 మార్కులు వచ్చాయని తెలిపారు. కళాశాలలో తమ ఫలితాలు సాధించిన మదులోహితను ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల బృందం అభినందించింది.

**కస్తూరిబా పాఠశాలలో** కస్తూరిబా పాఠశాలలో ప్రథమ సంవత్సరం 31 మంది పరీక్షలు రాస్తే 29 మంది ఉత్తీర్ణులయ్యారు, 94 శాతం ఉత్తీర్ణత ను సాధించారు. ద్వితీయ సంవత్సరం 22 మంది పరీక్షలు రాస్తే 16 మంది పాసయ్యారు. ఇక్కడ 73 శాతం ఉత్తీర్ణత లభించిందని ప్రిన్సిపల్ ద్రాక్షాయని తెలిపారు.

# జనగణన ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం




**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 15 :** జనగణన విధానంలో గృహాలు స్వచ్ఛందంగా ఆన్లైన్ ద్వారా కుటుంబ వివరాలు నమోదు చేసుకుని అవకాశం కల్పించబడిందని బండి ఆత్మకూరు తాసిల్దార్ మరియు చార్జి సెన్సెస్ అధికారి పద్మావతమ్మ బుధవారం పేర్కొన్నారు. జనగణన 2027 స్వీయ లెక్కింపు సౌకర్యం ఈనెల 16 ఏప్రిల్ 2026 నుండి 30 ఏప్రిల్ వరకు జనగణన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 2027 లో భాగంగా ప్రజల సౌకర్యార్థం స్వీయ లెక్కింపు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. కుటుంబ వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకుని అవకాశం కల్పించబడిందని, ఈ కారణంగా గృహాలకు ఎన్యుమరేటర్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. అతి సులభంగా వేగంగా వివరాలను సమర్పించవచ్చునని అన్నారు. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ సమయంలో పౌరులు తమ మొబైల్ నెంబర్ ద్వారా నమోదు చేసుకొని కుటుంబ సభ్యులు నివాస పరిస్థితిలు మౌలిక వసతులు తదితర వివరాలను నమోదు చేయవచ్చునని అన్నారు. సమర్పించిన సమాచారం సెన్సెస్ చట్టం ప్రకారం గోప్యంగా ఉంచబడుతుందని అన్నారు. ప్రజలందరూ ఈ డిజిటల్ సౌకర్యాన్ని వినియోగించుకొని ఖచ్చితమైన సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు అందించాలని తాసిల్దార్ విజ్ఞప్తి చేశారు. స్వీయ లెక్కింపు చేయని గృహాలను కవర్ చేయడానికి ఎన్యుమరేటర్లు సందర్శిస్తారని, ప్రజలందరూ జన గణన 2027 ను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించాలని తాసిల్దార్ విజ్ఞప్తి చేశారు.

# రాఘవేంద్ర లో శక్తి టీం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 15:** అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని శక్తి టీమ్ యాప్ బృందం విద్యార్థినిలకు సూచించింది. బుధవారం బండి ఆత్మకూరులోని రాఘవేంద్ర విద్యా మందిర్ విద్యార్థినిలకు యాప్ గురించి అవగాహన కల్పించారు. నంద్యాల ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ ఉత్తర్వుల మేరకు శక్తి టీం బృందం హెడ్ కానిస్టేబుల్ డిఎన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీ,మహిళా పోలీస్ లక్ష్మీదేవి, విద్యార్థినిలకు నోటచ్, ఎమర్జెన్సీ 112 కాల్ గురించి వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, వారు ఏదైనా తినుబండారాలు, వస్తువులు ఇచ్చినచో, తినరాదని చెప్పారు. అమ్మాయిని పట్ల చెడుగా ప్రవర్తించినట్లయితే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు తెలియజేప్పాలని, లేనిపక్షంలో 112 కు ఫోన్ చేయాలని చెప్పారు. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా అనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులకు శక్తి యాప్ గురించి వివరించి శక్తి యాప్ డౌన్లోడ్ చేయించి వారికి అవగాహన కల్పించారు.

# కోటి 10 లక్షలు మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన...

# కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.





**జిల్లా పోలీసు కార్యాలయంలో "4 వ విడత మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమం. ఇప్పటి వరకు మొత్తం 4 విడతలలో 2,402 మొబైల్స్ (రూ. 4 కోట్ల 8 లక్షల విలువ గల ఫోన్లు ) రికవరీ చేసి అందజేయడం జరిగింది.**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో......** బుధవారం కర్నూలు సైబర్ ల్యాబ్ , కర్నూలు పోలీసులు రికవరీ చేసిన 529 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో " మొబైల్ రికవరీ మేళా " కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్ల ను బాధిత ప్రజలకు అందజేశారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. బుధవారం కర్నూలు జిల్లా పోలీసులు , సైబర్ ల్యాబ్ పోలీసులు 4 వ విడతలో 529 ( విలువ రూ. 1 కోటి 10 లక్షలు) మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. ప్రజలు బస్సులు, రైళ్ళ లో ప్రయాణాలు చేసేటప్పుడు , రైల్వేస్టేషన్లు, జాతరలు, ఉత్సవాలలో ఇలా పలు చోట్ల మొబైల్స్ ను పోగొట్టుకుంటున్నారన్నారు. వాళ్ళ జేబులో నుండి పడిపోయి ఉండవచ్చు లేదా ఎవరైనా తెలియని వ్యక్తులు దొంగలించి ఉండొచ్చన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహరాష్ట్ర, తెలంగాణ మరియు పలు జిల్లాల నుండి రికవరీ చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ వచ్చినప్పటి ఇప్పటి వరకు నుండి నాలుగు విడతలలో మొత్తం 2,402 మొబైల్స్ ( రూ. 4 కోట్ల 8 లక్షలు విలువ గల ఫోన్లు) అందజేయడం జరిగిందన్నారు.

మొదటి విడతలో 600 మొబైల్స్ రూ. 1 కోటి 20 లక్షలు.

రెండవ విడతలో 604 మొబైల్స్ రూ. 1 కోటి 30 లక్షలు.

మూడవ విడతలో 669 మొబైల్స్ రూ. 1 కోటి 20 లక్షలు.

నాలవ విడతలో 529 మొబైల్స్ రూ. 1 కోటి 10 లక్షలు.)

ఎవరైనా మొబైల్ పోగోట్టుకుంటే వెంటనే కర్నూలు పోలీసు వెబ్ సైట్ కు వెళ్ళి పొగోట్టుకున్న మొబైల్ ×వీజు వివరాలు తెలియజేస్తే సెల్ ఫోన్ రికవరీ చేసేందుకు కర్నూలు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈ పోలీసు సేవ కు ఏలాంటి రుసుము చెల్లించకుండా ఉచితం అని , మొబైల్ పోయిన తర్వాత బాధపడడం కంటే ఆ మొబైల్ ఫోన్ పోగోట్టుకోకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదన్నారు. మొబైల్స్ రికవరీ చేసిన కర్నూలు పోలీసులను అభినందిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నా మన్నారు.ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ అనేది మన జీవితంలో ఒక భాగంగా ఉందన్నారు.ప్రతి రోజూ ప్రతి పనిలో మొబైల్ ఉపయోగం ఉంటుందన్నారు.ఆన్ లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు పర్సనల్ వివరాలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావా దేవిలు, అటాచ్ మెంట్స్, సెంటిమెంట్స్, ఇలా చాలా మిస్ అవుతూ ఉంటారన్నారు.మొబైల్స్ రికవరీ చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించి , ప్రశంసా పత్రాలు అందజేశారు. సెల్ ఫోన్ పొగోట్టుకున్న బాధితులు రికవరీ చేసి ఇచ్చినందుకు జిల్లా ఎస్పీ కి, సైబర్ ల్యాబ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

1) గణేష్ ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు నుండి పెద్దమర్రివీడుకు వెళుతున్నప్పుడు జేబులో నుండి నా మొబైల్ పోయింది. నా ఫోన్ ను కర్ణాటక లో రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

2) చిధానంద కోసిగి.

ప్రవేట్ స్కూల్ లో పని చేస్తున్నాను. వాకింగ్ కు వెళ్ళినప్పుడు కోసిగి లో నా మొబైల్ పొగోట్టుకున్నాను. మహరాష్ట్ర లో రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

3) సుధాకర్ - వెల్దుర్తి - యాదర్ల గ్రామం

వెల్దుర్తి మండలం, యాదర్ల గ్రామం లో వ్యవసాయం పని చేస్తున్నాను. ఉల్చాల గ్రామంలో జాతర జరుగుతున్నప్పుడు మొబైల్ పోయింది. నా మొబైల్ హైదరాబాద్ లో రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

4) మల్లికార్జున కర్నూలు.

నేను హెల్త్ డిపార్ట్ మెంట్ లో పని చేస్తున్నాను. కర్నూలు , రాజ్ విహార్ సెంటర్ లో బస్సు ఎక్కేటప్పుడు మొబైల్ పోయింది. నా మొబైల్ తమిళనాడులో రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

5) సుమంత్ - కర్నూలు.

కర్నూలు రెడ్డి గ్యారేజ్ వద్ద నేను మెకానిక్ పని చేస్తున్నాను. కర్నూలు , నంద్యాల చెక్ పోస్టు వద్ద మొబైల్ పోయింది. మహరాష్ట్రలో మొబైల్ రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

6) కె. శ్రీకాంత్ పత్తికొండ .

బెంగుళూరు లో సాఫ్ట్ ఫేర్ ఇంజనీరింగ్ జాబ్ చేస్తున్నాను. మార్చి 15 న మా స్వగ్రామం పత్తికొండ, లక్ష్మీనగర్ లో దేవరకు వెళ్ళేటప్పుడు బైక్ పెట్రోల్ ట్యాంకర్ కవర్ లో మొబైల్ పెట్టి ఇంటి పైకి వెళ్ళి తాళం వేసి వచ్చేలోపే మొబైల్ పోయింది.నా మొబైల్ హైదరాబాద్ లో దొరకడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు ఎస్పీ తో పాటు కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు మధుసుధన్ రావు, శివశంకర్, సైబర్ ల్యాబ్ సిఐ మస్తాన్ , సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పోలీసులు పాల్గొన్నారు.





## ఇంటర్ ఫలితాల్లో పఠాన్ జుబేదా ప్రతిభ



**ఆత్మకూరు, ఏప్రిల్ 15: (నంది పత్రిక)** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఆత్మకూరు పట్టణానికి చెందిన పఠాన్ జుబేదా ఉత్తమ ఫలితాలను సాధించారు. స్థానిక తెరిసా జూనియర్ కళాశాలలో చదువుతున్న ఈమె, ఇంటర్మీడియట్ (జనరల్) విభాగంలో 1000 మార్కులకు గాను 897 మార్కులు సాధించి 'ఏ' గ్రేడ్ కైవసం చేసుకున్నారు. సబ్జెక్టుల వారీగా చూస్తే, జుబేదా లాంగ్వేజెస్ లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. సంస్కృతంలో 99, ఇంగ్లీష్ లో 96 మార్కులు సాధించడంతో పాటు, ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌లో 30కి 30 మార్కులు సాధించి తన సత్తా చాటారు. గ్రామీణ నేపథ్యం ఉన్నప్పటికీ, పట్టుదలతో చదివి ఈ స్థాయి మార్కులు సాధించడం పట్ల కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని జుబేదా ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన విజయంలో కీలక పాత్ర పోషించిన కళాశాల యాజమాన్యానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులకు బోధన అభ్యాస సామాగ్రి పంపిణీ



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 15 . (నంది పత్రిక ):**నంద్యాల కు చెందిన పొన్నాపురం హైస్కూల్ హెచ్ ఎమ్ సూర్యపోగు ఐజయ్య (రిటైర్డ్) మోడల్ ప్రైమరీ స్కూల్ రాయమాల్పురం పాఠశాలకు ₹6000/- విలువైన1,2 తరగతుల విద్యార్థులకు అవసరమయ్యే బోధన అభ్యాస సామాగ్రి విరాళంగా లక్ష్మణ్ నాయక్ కు అందజేశారు.. ఈ సందర్భంగా ఐజయ్య విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ మీకు పాఠాలు అర్థం కాకుంటే ఉపాధ్యాయులకు మళ్ళీ అడగాలని ఒకవేళ మీకు తెలిసుంటే మీ మిత్రులకు చెప్పాలని మీకున్న జ్ఞానాన్ని పదిమందికి పంచాలని అలాగే విద్యార్థులకు మిమిక్రీ చేసి నవ్వించారు.. ఉపాధ్యాయులు సుజాత, ఓబయ్య, సత్యవతమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరశైవులను రాజకీయంగా గుర్తించిన ఏకైక పార్టీ తెలుగుదేశం...ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** వీరశైవుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు ...నగరంలోని శ్రీరామ థియేటర్ లో నిర్వహించిన వీర శైవుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టీ.జీ భరత్ గుప్త తో కలిసి ఆయన పాల్గొన్నారు...ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వీరశైవ లింగాయత్ లను రాజకీయంగా గుర్తించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు.. వీరశైవ సామాజిక వర్గానికి చెందిన వీరభద్ర గౌడ్ కి ఆలూరు నుంచి రెండు సార్లు ఎం.ఎల్.ఏ టికెట్ కేటాయించిన ఘనత టీడీపీ కే దక్కుతుందన్నారు... ఇక వీర శైవులను ఓ.బీ.సీ జాబితాలో చేర్చే విషయం పై పార్లమెంటులో చర్చిస్తానన్న ఎంపీ.. ఇక అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని కోరారు... అంతకుముందు బంగారుపేట సర్కిల్ వద్ద నూతనంగా ఆవిష్కరించిన బసవేశ్వరుడి విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళు అర్పించారు...



## ఎంపీసీలో కళాశాల టాపర్ సునయన



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 16:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో బండి ఆత్మకూరు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని జి సునయన కళాశాల టాపర్గా నిలిచింది. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సునయన 900 మార్కులు సాధించింది. బైపీసీలో ఎస్ యాస్మిన్ బేగం 903 మార్కులు, సీఈసీలో ఈ మాధవి 893 మార్కులు, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బీ భారతీయ 394 మార్కులు, బైపీసీ లో ఏ లక్ష్మీప్రసన్న 397 మార్కులు, సీఈసీలో ఏ చంద్రకాంత్ 350 క మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 63 మంది గాను 40 మంది ఉత్తీర్ణులయ్యారని 63.5% సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 95 మందికి గాను 84 మంది ఉత్తీర్ణత సాధించగా 88.4 శాతం ఉత్తీర్ణత లభించిందని కళాశాల ప్రిన్సిపల్ వెంకటనారాయణ పేర్కొన్నారు.

## ఆత్మవిశ్వాసమే భరత్ విజయ రహస్యం



**సిరివెళ్ల (నంది పత్రిక)** "అంగవైకల్యం అడ్డు కాదు రాష్ట్ర స్థాయికి"నంద్యాల జిల్లా అయ్యలూరులోని ఎస్ వి ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ కు చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి పీ. భరత్ కుమార్ డ్రాగన్ బోట్ క్రీడలో ప్రతిభ చూపుతూ రాష్ట్ర స్థాయి పోటీలో ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభా కనబరిచిన పి.భరత్ కుమార్ కు ఏప్రిల్ 11, 12 తేదీలలో విజయవాడ నగరంలో జరిగిన డ్రాగన్ బోట్ అండర్ -18 రాష్ట్ర స్థాయి పోటీలో బ్రాంచ్ మెడల్ సాధించడం జరిగినది శారీరక అంగవైకల్యం ఉన్నప్పటికీ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా కళాశాల ఎం.డి. దినేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై. హరిప్రసాద్ రెడ్డి, హెచ్ & ఎస్ శ్రీ నరసింహరావు, పీ.డి. విల్సన్ కుమార్ భరత్ కుమార్ ను అభినందిస్తూ, "అంగవైకల్యం అడ్డు కాదు సరైన ప్రోత్సాహం ఉంటే ప్రతిభ ఎక్కడికైనా చేరుతుంది" అని పేర్కొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ టాలెంట్ టెస్టులో జిల్లా టాపర్గా నిలిచిన నారిశెట్టి విజయశ్రీ మహాలక్ష్మి నాయుడు





**సిరివెళ్ల:(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని రాజనగరం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో 8వ తరగతి చదువుతున్నటువంటి నారిసెట్టి విజయశ్రీ మహాలక్ష్మి నాయుడు అను విద్యార్థిని తన ప్రతిభా పాటవాలతో జిల్లా టాపర్గా నిలిచారు. జిల్లాస్థాయిలో ఎంతోమంది తమ ప్రతిభను చాటుకొని నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ కు రాసిన టాలెంట్ టెస్టులో జిల్లా టాపర్గా నిలిచిన కారణంగా విజయ శ్రీ మహాలక్ష్మి యొక్క తల్లిదండ్రులు అయినటువంటి శివనాగనందిని నారి శెట్టి శివప్రసాద్ లను గ్రామ పెద్దలు ప్రముఖులు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు నుండి అభినందనలు వెల్లువెత్తాయి. గ్రామీణ స్థాయి పల్లెటూరిలో విద్యాబుద్ధులు నేర్చుకుంటూ జిల్లా స్థాయిలో నిర్వహించిన మెరిట్ స్కాలర్షిప్ టాలెంట్ టెస్ట్ లో అత్యుత్తమ ప్రతిభను కనపరిచి జిల్లా టాపర్గా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల రాజనగరం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది. తల్లిదండ్రులైనటువంటి శివప్రసాద్ శివ నాగనందిని దంపతులను సైతం అభినందించారు. నారి శెట్టి విజయశ్రీ మహాలక్ష్మి నాయుడు యొక్క ప్రతిభ పాటవాలను తోటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని అత్యుత్తమ విజయాలు సాధిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న స్కాలర్షిప్లకు ఎంపిక అవుతూ పోటీ పరీక్షల్లో తిరుగులేని విజయాలను సాధించాలని పిలుపునిచ్చారు.

## పాకిస్థాన్‌కు అప్పులోళ్ల బాధ... వెంటబడుతున్న గల్ఫ్ దేశాలు!

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు మిత్ర దేశాల నుంచి కూడా ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తమకు చెల్లించాల్సిన 3 బిలియన్ డాలర్ల రుణాన్ని పునరుద్ధరించేందుకు (రోలోవర్) నిరాకరించింది. గడువు ముగిసిన ఈ అప్పును వెంటనే తిరిగి చెల్లించాల్సిందేనని ఇటీవలే హెచ్చరించడం తెలిసిందే. అదేబాటలో పలు ఇతర దేశాలు కూడా పాక్ ను అప్పులు చెల్లించాలని వెంటబడుతున్నాయి. ఈ పరిణామాలతో ఇస్లామాబాద్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అనేక సంవత్సరాలుగా గల్ఫ్ దేశాలు, చైనా వంటివి పాకిస్థాన్‌కు అండగా నిలుస్తున్నా, ఇప్పుడు వాటి సహనం నశిస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.20వేలు విరాళం...



**మంత్రాలయం , న్యూస్ :-** మండల కేంద్రమైన నందవరం గ్రామంలో నిర్మించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి బూదురు వైఎస్సార్సీపీ నాయకులు మీనిగి జక్కయ్య రూ. 20 వేల రూపాయలు బుధవారం విరాళంగా అందజేశారు. మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో తన స్వగృహములో నందవరం అంబేద్కర్ యువజన సంఘ సభ్యులకు ఈ విరాళాన్ని అందజేశారు. సందర్భంగా జక్కయ్య మాట్లాడుతూ తన శక్తి మేరకు అనాధలకు,దళితులకు పేదవారికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు జక్కయ్యకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ప్రకాశం,వినోద్ కుమార్ సురేష్, చక్రవర్తి,శేఖర్,సుందరరాజు వినోద్, గురురాజు తిప్పరాజు, హుస్సేనీ,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్ల ప్రారంభం ప్రజలకు రూ.5కే నాణ్యమైన భోజనం





### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం పాణ్యం నియోజకవర్గంలో మూడో అన్న క్యాంటీన్ ప్రారంభం: పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరితా రెడ్డి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్ల ను ప్రారంభించడం జరిగిందని, ప్రజలకు రూ.5కే నాణ్యమైన భోజనం అందించడం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండల పరిధిలోని నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలో ప్రజా ఆరోగ్య, పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో రూ. 61.00 లక్షలతో నిర్మించిన నూతన అన్న క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కలసి అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజలకు భోజనం వడ్డించి, అన్న క్యాంటీన్ లో భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పేద ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన అన్న క్యాంటీన్ లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. ఈ రోజు జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 11 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయన్నారు. అన్న క్యాంటీన్ ల ద్వారా ప్రజలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఒక్కో భోజనానికి సుమారు రూ.34 లు, టిఫిన్‌కు రూ.22 లు ఖర్చు అవుతుండగా, ప్రభుత్వం ఈ ఖర్చును భరిస్తూ ప్రజలకు కేవలం రూ.5కే అందిస్తున్నదని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న అన్న క్యాంటీన్లను స్వయంగా సందర్శించి, భోజన నాణ్యత, సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. అందరూ సేవలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ప్రస్తుత కాలంలో రూ.5కు టీ కూడా దొరకని పరిస్థితుల్లో అన్న క్యాంటీన్ల ద్వారా అన్నం, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి వంటి ఐదు రకాల వంటకాలను అందించడం బాగుందని ప్రజలు స్పందిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పరంగా కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అన్న క్యాంటీన్‌లో రోజుకు ఉదయం టిఫిన్‌కు 300 నుండి 400 మంది, మధ్యాహ్నం భోజనానికి 400 నుండి 500 మంది, రాత్రి భోజనానికి సుమారు 500 మంది వరకు ప్రజలు భోజనం చేస్తున్నారని వివరించారు. ఈ రోజు ప్రారంభించిన కొత్త 4 అన్న క్యాంటీన్ల ద్వారా మరింత మందికి ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం పాణ్యం నియోజకవర్గంలో మూడో అన్న క్యాంటీన్ ప్రారంభం: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో ఇప్పటికే రెండు అన్న క్యాంటీన్లు పనిచేస్తుండగా, తాజాగా ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌తో మొత్తం మూడు క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు తొలి సంతకం.చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కాలంలో అన్న క్యాంటీన్లు మూసివేయబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణతో పాటు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. 2024 ఆగస్టు 15న తొలి దశలో 100 అన్న క్యాంటీన్లు, సెప్టెంబర్ 19న మరో 75 క్యాంటీన్లు ప్రారంభించగా, అనంతరం దశలవారీగా మొత్తం 204 క్యాంటీన్లు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాజాగా ప్రారంభించిన 62 క్యాంటీన్లతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 266 అన్న క్యాంటీన్లు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సుమారు 2 లక్షల 10 వేల మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 8 కోట్ల 80 లక్షల మందికి భోజనం అందించినట్లు వివరించారు. ప్రతి క్యాంటీన్‌లో సగటున 500 మంది భోజనం చేస్తున్నారని తెలిపారు. నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ అన్న క్యాంటీన్ ఓర్వకల్లు, నందికొట్కూరు ప్రాంతాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయికి అన్న క్యాంటీన్ సేవలను విస్తరించడం హర్షణీయమని, పేదల ఆకలి తీర్చే దిశగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. పాణ్యం నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎస్.ఈ రమణమూర్తి, మున్సిపల్ ప్రజా ఆరోగ్య విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్, డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ నాగ శేషారావు, జనసేన అధ్యక్షులు సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ఫలితాలలో మర్రిపాడు విద్యార్థుల హవా



**మర్రిపాడు ఏప్రిల్ 15నంది పత్రిక :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో మర్రిపాడు మండలంలోని అన్ని కాలేజీల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అకౌంట్స్ అండ్ టాక్సేషన్ (ఒకేషనల్ కోర్స్) గ్రూప్ విద్యార్థులు మొదటి సంవత్సరం ఫలితాల్లో 97 శాతం,రెండో సంవత్సరం ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 81 శాతం,ద్వితీయ సంవత్సరం లో 86% ఉత్తీర్ణత సాధించారు.నందవరం మాడల్ స్కూల్ విద్యార్థులు మొదటి సంవత్సరం ఫలితాలలో 62 శాతం,రెండవ సంవత్సరం ఫలితాల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు.ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపు నందు నందవరం మోడల్ స్కూలుకు చెందిన కలిశెట్టి జ్ఞాపిక 1000 కి 971 మార్కులతో మండలంలో మొదటి స్థానం,మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కావేరి 1000 కి 948 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించారు.బైపీసీ గ్రూప్ నందు 1000 కి 852 మార్కులతో నందవరం మోడల్ స్కూల్స్ చెందిన షారోన్ మండల ప్రథమ స్థానం పొందింది.సీఈసీ గ్రూపు నందు మర్రిపాడు జూనియర్ కళాశాల చెందిన నాగశ్రీ 1000 కి 965 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం,ఇదే కళాశాల కు చెందిన జాహ్నవి 884 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు.అకౌంట్స్ అండ్ టాక్సేషన్ (ఒకేషనల్ కోర్స్) గ్రూప్ నందు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థిని దీక్ష 1000 కి 974 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం దక్కించుకుంది.ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ నందు నందవరం మోడల్ స్కూల్ కు చెందిన వర్షిత 470 కి 455 మార్కులతో మండల ప్రథమ స్థానం,ఇదే కళాశాలకు చెందిన వినీత 449 మార్కులతో ద్వితీయ స్థానం పొందారు.బైపీసీ గ్రూపు నందు నందవరం మోడల్ స్కూల్ కు చెందిన సంధ్య 440 కి 410 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం పొందింది.సీఈసీ గ్రూపు నందు మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రవల్లిక 500 కి 482 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం,ఇదే కళాశాలకు చెందిన రమాదేవి 449 మార్కులతో ద్వితీయ స్థానం పొందారు.అకౌంట్స్ అండ్ టాక్సేషన్ గ్రూపు నందు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం కు చెందిన స్వాతి 500 కి 485 మార్కుల తో మండలంలో ప్రథమ స్థానం సాధించింది.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు,అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కస్తూర్బా పాఠశాల విద్యార్థిని




**సిరివెళ్ల (నంది పత్రిక)** 963 మార్కులు సాధించిన జి.మధులత శిరివెళ్ళ మండలంలో విద్యార్థిని ప్రతిభ ప్రతిభావంతంగా వెలుగొందింది. ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో 963 మార్కులు సాధించి గుర్రాల మధులత టాప్ ర్యాంక్ సాధించింది. శిరివెళ్ళ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న మధులత ఈ ప్రతిభను కనబరిచింది. సాధారణ కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని తన కృషి , పట్టుదలతో ఉన్నత ఫలితాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. మజరా గ్రామమైన ఖాదర బాదరా గ్రామానికి చెందిన బ్రహ్మయ్య కుమార్తె అయిన మధులత చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ చూపుతూ వస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం , ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో నిరంతరం కృషి చేసి ఈ విజయం సాధించినట్లు మధులత తెలిపారు. మధులత సాధించిన ఈ విజయం పాఠశాలకు , గ్రామానికి గర్వకారణమైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు , గ్రామ పెద్దలు , స్థానిక ప్రజాప్రతినిధులు మధులతను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఇలాంటి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి ఉన్నత ఫలితాలు సాధించడం ద్వారా ఇతరులకు ప్రేరణగా నిలుస్తున్నారని విద్యావేత్తలు పేర్కొన్నారు.

# పట్టాధార్ పాస్‌బుక్‌ల పంపిణీ మార్చి 2027 నాటికి పూర్తి చేయాలి.

### వర్షపు నీటిని నిలువ చేసే చర్యలు తీసుకోవాలి - అన్ని చెరువు లు నీటితో నింపాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ నుండి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు.బుధవారం సాయంకాలం చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులతో మాట్లాడుతూ...22ఏ రికార్డు లు సరి చేయాలని , రెవెన్యూ రికార్డు ల డిజిటలైజషన్ లు త్వరగా చేయాలని , రీసర్వే పనులు అన్ని పూర్తి చేసుకుని మార్చి 2027 నాటికి అన్ని పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణి పూర్తి చేయాలని , గత కొన్ని నెలల నుండి పెండింగ్‌లో ఉన్న అన్ని మ్యుటేషన్‌లు మరియు సబ్-డివిజన్‌లను జూన్ 2026 నాటికి పూర్తి చేయాలి అని,పట్టా దార్ పాసుబుక్ ల పంపిణీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి గారు రీ సర్వేను సమీక్షిస్తారు. ఎలాంటి తప్పులు లేని పాస్‌బుక్‌లు జారీ చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. కావున ఎలాంటి తప్పులు ఉండరాదని పాస్‌బుక్‌ల విషయంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా, సంబంధిత అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి అని కలెక్టర్ తెలిపారు .వర్షపు నీటిని నిలువ చేసుకునే అన్ని చర్యలు , చెరువుల లో ఉన్న పూడికలు , పంటకాలువల పూడికలు తీసే చర్యలు చేపట్టాలని అన్ని చెరువులు నీటితో నింపే చర్యలు తీసుకోవాలి అని వీటి ద్వారా భూగర్భ జలాలు పెరిగే చర్యలు చేపట్టాలని అని కలెక్టర్ ఆదేశించారు.ట్యాంక్ వైస్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఒక ట్యాంక్ నుంచి ఇంకో ట్యాంక్ కు నీరు చేరే లాగా అనుసంధానం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టి మాస్టర్ ట్రైనర్స్ ని గుర్తించాలి అన్నారు. గుర్తించిన వారిని అన్నమయ్య జిల్లాకు పంపించి అక్కడ వారికి ట్రైనింగ్ ఇప్పించి కర్నూలు జిల్లా లో ఆవిధంగా పనులు జరిగే లాగా చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. ఒక గ్రామపంచాయతీలో ఎన్ని ట్యాంకులు ఉన్నాయి? ఆ ట్యాంకులకు సంబంధించి జరుగవలసిన మరమ్మత్తు పనులు గుర్తించి వాటిలో ఎన్ని అప్రూవ్ చేశారో ఆ ట్యాంకులకు ఇప్పుడు ఎస్టిమేట్ జెనరేట్ చేయాలి ఆదేశించారు .ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఇన్చార్జ్ డిఆర్ఓ చిరంజీవి , జిల్లా పరిషత్ సీఈవో రమణారెడ్డి , డ్వామా పిడి నరసింహారెడ్డి , పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి , డిజాస్టర్ మేనేజ్మెంట్ పి ఓ సురేష్ కుమార్ , పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్ , ఎస్ డి సి నాగప్రసూన , డిపిఓ భాస్కర్ , గ్రౌండ్ వాటర్ డి. డి. సునీల్ కుమార్,తహసీల్దార్ లు వెంకటేశ్వర్లు , ప్రకాష్ బాబు మొదలగు వారు పాల్గొన్నారు.

# గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో అరుదైన పెద్ద ట్యూమర్ కు శస్త్రచికిత్స విజయవంతం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూల్ మెడికల్ కాలేజీ సర్జరీ విభాగపు వైద్యులు మరోసారి తమ ప్రతిభను చాటుతూ, ఒక అరుదైన మరియు క్లిష్టమైన కేసును విజయవంతంగా శస్త్రచికిత్స ద్వారా చికిత్స నిర్వహించడం జరిగింది. కర్నూలు జిల్లాకు కొత్త బురుజుకు చెందిన 75 సంవత్సరాల వయసు గల ముత్తయ్య అనే రోగి 6/4/2026 తేదీన కడుపులో నొప్పి మరియు వాపుతో కర్నూల్ గవర్నమెంట్ ఆసుపత్రిలో చేరగా, సర్జరీ విభాగపు ఫస్ట్ యూనిట్ వైద్యులు వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి పరిశీలించినప్పుడు, రోగికి పొట్ట వెనుక భాగంలో సుమారు 30 సెం.మీ x 20 సెం.మీ పరిమాణంలో భారీ ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ ట్యూమర్ ముఖ్య అవయవాలైన కిడ్నీ వంటి భాగాలకు దగ్గరగా ఉండడం వల్ల శస్త్రచికిత్స అత్యంత క్లిష్టంగా మారింది. ఈ కేసును జనరల్ సర్జరీ విభాగం వైద్య బృందం సమగ్రంగా పరిశీలించి, సమన్వయంతో శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్సలో ట్యూమర్‌ను పూర్తిగా తొలగించడం తో పాటు, అవసరమైన చోట కిడ్నీపై వైద్య జోక్యం చేపట్టి రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించారు.

ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందంలో వైస్ ప్రిన్సిపల్, సర్జరీ విభాగపు అధిపతి డా. హరి చరణ్, అసోసియేట్ డాక్టర్ విజయబాబు క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డాక్టర్ నరేష్ అసిస్టెంట్లు డాక్టర్ మహేష్ తజ్మహల్ హుస్సేన్, అనస్తీసియా విభాగం నుండి ప్రొఫెసర్ డాక్టర్ రామ శివ నాయక్,డా. అరుణలత డాక్టర్ భార్గవ్ మరియు ఇతర వైద్యులు మరియు సిబ్బంది

ప్రధాన పాత్ర పోషించారు.శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం స్థిరంగా ఉండి, కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా అడిషనల్ డిఎంఇ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్య బృందాన్ని అభినందిస్తూ, ఇటువంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా సంస్థ ప్రతిష్టను మరింత పెంచారని తెలిపారు.కర్నూల్ మెడికల్ కాలేజీ సర్జరీ విభాగపు హెచ్ ఓ డి డా. హరిచరణ్ ఆధ్వర్యంలో నేడు మూడు గంటల పైగా శ్రమించి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది . వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రోగికి ఉచితంగా సర్జరీ చేసి అన్ని సేవలు అందించడం జరిగింది అని తెలిపారు.



# సమయపాలన పాటించాలి

### - తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి - నందిపత్రిక :** సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొక్కరంచ గ్రామంలోని సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా హాజరు రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు, ఆన్లైన్ బయోమెట్రిక్ అటెండెన్స్ సరిగా వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాయాల్లో విదులు నిర్వహించే సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించపోతే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. ఎటువంటి పనిపై బయటికి వెలితే మూమెంట్ రిజిస్టర్లు తప్పకుండా నమోదు చేయాలని చెప్పారు. ప్రజలనుంచి ఏవరిపై అయిన పిర్యాదులు వస్తే వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

# సమతుల్య ఆహారం తీసుకోవాలి

### ఐసిడియస్ సూపర్వైజర్లు కుమారి, నాగేశ్వరమ్మలు



**కొత్తపల్లి - నంది పత్రిక:** మగవారు సమతుల్య ఆహరం తీసుకోవాలని ఐసిడియస్ సూపర్వైజర్లు కుమారి, నాగేశ్వరమ్మలు సూచించారు మండల పరిదిలోని కొక్కెరంచ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నందు పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. సమతుల్య ఆహారాన్ని ఎలా తయారు చేయాలి అనే విషయాలపై మగవారికి అవగహణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమతుల్య ఆహారంలో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజాలు, కొవ్వులు, పీచుపదార్థం, నీరు అన్ని సమపాలలో లబిస్తాయన్నారు. రోగనిరోదక శక్తిని పెంచేందుకు తోడ్పడతాయన్నారు మగవారితో పాటు మహిళలు, గర్భవతులు, బాలింతలు సమతుల్య ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా వుండాలన్నారు. శారీరక,మానసిక వికాసానికి, ఆరోగ్యకరమైన జీవనానికి ఈ ఆహారం ఎంతగానో ఉపయోగ పడుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన నిర్వహించారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపద్యాయురాలు పుష్పావతి ఉపాధ్యాయులు, ఏయన్యాం మాదవిదేవి, అంగన్వాడి కార్యకర్తలు గర్భవతులు, బాలింతలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ తొలి మహిళా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు.- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 15 ( నంది పత్రిక ) తెలుగుదేశం పార్టీకి తొలి మహిళా జాతీయ ప్రధాన కార్యదర్శిగా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని టీడీపీ ప్రకటించడం, పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణకు ముందు ఒక పెద్ద సందేశం ఇచ్చినట్లయింది. తెలుగుదేశం పార్టీలో భారీ మార్పులో భాగంగా, టీడీపీ తన తొలి మహిళా జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బైరెడ్డి శబరిని అధికారికంగా ప్రకటించారు. లి మంత్రి నారా లోకేష్ టీమ్ లోకి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గా రాష్ట్ర మంత్రి, నారా లోకేష్ ను ప్రకటించి, నారా లోకేష్ టీం లోకి తొలి మహిళా జాతీయ ప్రధాన కార్యదర్శి గా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని నియమించడం ప్రత్యేకం.ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బుధవారం అధికారికంగా ప్రకటించిన పార్టీ పదవుల్లో తనకు తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవా చేసే అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ బాధ్యతను నాపై నమ్మకంతో అప్పగించించిన టీడీపీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.టీడీపీ బలోపేతం కోసం,ప్రజల సేవ కోసం పూర్తి నిబద్ధతతో,కృషితో ముందుకుసాగుతానని అన్నారు. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శిగా నియమిస్తూ టీడీపీ అధిష్టానం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి కీలక పదవి వరించడంతో నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో డాక్టర్ బైరెడ్డి శబరి అనుచరులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన కార్యదర్శిని ప్రకటించింది. ఎంపీ రామ్ మోహన్ నాయుడు, కిలారు రాజేష్‌లతో పాటు డాక్టర్ బైరెడ్డి శబరిని జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రకటించారు.



# ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



నందిపత్రిక --ప్యాపిలి ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయ దంకా మోగించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలను సాధించి, ప్రభుత్వ విద్యా సంస్థల సత్తాను చాటిచెప్పారు. కళాశాలకు చెందిన గొడుగు రమ్య (సీనియర్ వీూజ) 1000 మార్కులకు 984 మార్కులు సాధించి నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లోనే ప్రథమ స్థానం సాధించింది. గతంలో 2023 సంవత్సరంలో కె . మానస నెలకొల్పిన 976 మార్కుల రికార్డును రమ్య అధిగమించి, కళాశాల సరికొత్త రికార్డును సృష్టించింది. ద్వితీయ సంవత్సరంలో 83 మంది విద్యార్థులకు గాను 49 మంది ఉత్తీర్ణత సాధించి 59% ఫలితాలను నమోదు చేశారు. మొదటి సంవత్సరంలో 106 మందికి గాను 59 మంది ఉత్తీర్ణులై 51.6% ఫలితాలను సాధించారు.సీనియర్ విభాగం: +. రమ్య (984), ూ. సానియా (908), ం. పూజిత (918), ూ. మైమూంతాజ్ (843), ూవీణ గౌస్ (848), +. స్వాతి (835), దీ. శ్రీనివాసులు (838), +. వంశీ (733).జూనియర్ విభాగం: +. భారతి (461/470), ఎ. ఉమాదేవి (456), ఖ. మమత (455), హర్షవర్ధన్ రంగా (454), ఖ. అపర్ణ (444/455), ఖ. స్వాతి (439), ఖూ. నందిని (432), ూ. జిక్రా తస్లీన్ (430), జ. రేఖమ్మ (440/500), ూ. మహమ్మద్ షరీఫ్ (420/500). కళాశాల ఫలితాలు విడుదలైన తరుణంలో ప్యాపిలి ఎంపీడీఓ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు సాధించిన గొప్ప ఫలితాలను చూసి ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ అతి సాధారణ విద్యార్థులుగా కళాశాలలో చేరి, క్రమశిక్షణతో చదివి నేడు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చూస్తుంటే గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈ విజయంలో పాలుపంచుకున్న అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

# 100 కుటుంబాలతో కాంగ్రెస్ పార్టీలో చేరిన మీసాల సుమలత





**కాంగ్రెస్ పార్టీ లో మహిళలకు అధిక ప్రాధాన్యత**

**జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా మీసాల సుమలత నియామక పత్రం అందజేసిన డిసిసి అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ**

కర్నూలు ప్రతినిధి నందిపత్రిక స్వచ్ఛంద సేవకురాలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నగర అధ్యక్షురాలు శ్రీమతి మీసాల సుమలత , వంద కుటుంబాలతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఉదయం కోట్ల సర్కిల్ నుండి మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహమునకు పూలమాలలు వేసి అక్కడి నుండి ర్యాలీగా పార్టీ కార్యాలయమునకు విచ్చేసి పార్టీ కార్యాలయం ముందు గలమాజీముఖ్యమంత్రివర్యులు, ఎఐసిసి మాజీ అధ్యక్షులు స్వర్గీయ శ్రీ దామోదరం సంజీవయ్య విగ్రహమునకు పూలమాలలు వేసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయమునకు రావడమయినది. సుమలత కి మాజీ మంత్రి మూలింటి మారెప్ప మరియు కాంగ్రెస్ నాయకుల సమక్షంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి క్రాంతి నాయుడు పార్టీ కండువా వేసి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. ఆమె వెంట వంద కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరడమైనది. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అమర్జహ బేగ్ సూచన మేరకు సుమలత కి కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియామక పత్రంఅందజేయడమయినది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి క్రాంతి నాయుడు మాట్లాడుతూ సుమలత చేరికతో కాంగ్రెస్ పార్టీ బలం చేకూరిందని సుమలత కర్నూలు నగరంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థ ద్వారా కార్యక్రమాలను నిర్వహించారని కర్నూల్ నగరంలో పరిచయస్తులేనని కనుక సుమలత తో జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా క్రాంతి నాయుడు తెలియజేశారు. అనంతరం సుమలత మాట్లాడుతూ నా మీద నమ్మకంతో కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి కి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అమర్జహా బేగ్ కి, కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి క్రాంతి నాయుడు కి మరియు కాంగ్రెస్ రాష్ట్ర మరియు జిల్లా నాయకులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని జిల్లాలో మహిళా కాంగ్రెస్ ను బలోపేతం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలలోనికి తీసుకుని వెళ్లి కార్యక్రమాలు చేపట్టి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషి చేస్తామని సుమలత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేంద్ర రెడ్డి, ఐఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, కాంగ్రెస్ నాయకులు సౌల్ రాజు, కల్లూరు ప్రభాకర్, కేశవరెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

# టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా మానవ్వి దేవేంద్రప్ప

**దేవేంద్రప్ప కు ఘన సన్మానం**



నంది పత్రిక ఆదోని ప్రతినిధి, ఏప్రిల్ 15, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప కు టిడిపి అధిష్టానం పార్టీలో కీలకమైన రాష్ట్రస్థాయి పదవి కార్యనిర్వాహక కార్యదర్శి గా నియమించింది. బుధవారం వేడుకను పురస్కరించుకొని నెట్టేకల్ టిడిపి సీనియర్ నాయకులు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో దేవేంద్రప్పకు ఘన సన్మానం నిర్వహించారు. ముందుగా మహేష్ యాదవ్ దేవేంద్రప్ప కు పూలమాలలు వేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందిఈ . సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని, రాష్ట్రంలో ఉన్న ప్రతి టిడిపి కార్యకర్త సైనికులుగా కృషి చేస్తే అధిష్టానం గుర్తించి అందరికి పదులతోపాటు హోదాలను సైతం కల్పిస్తుందని తెలిపారు. తాను గత 40 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీకి అనేక సేవలు చేస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సేవలను గుర్తించే రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం మరియు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్నుకున్నారని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టిన చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండగిరి టిడిపి నాయకులు పరమేష్, పెద్ద హరివనం టిడిపి నాయకులు షేకప్ప, మానప్ప, బీరప్ప, గర్జప్ప, అనిల్, గర్జప్ప తదితరులు పాల్గొన్నారు.

# గృహగణన సర్వే పకడ్బందీ నిర్వహించండి



కర్నూలు నంది పత్రికబ్యూరో.... జనగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా ఖచ్చితమైన సమాచారం సేకరణ సాధ్యమవుతుందని, అదే ప్రభుత్వ ప్రణాళికలకు పునాది అవుతుందని నగరపాలక అదనపు కమిషనర్, సిటి సెన్సస్ ఆఫీసర్ ఆర్‌జివి, డిప్యూటీ కమిషనర్, చార్జ్ ఆఫీసర్ సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. భారతదేశ జనాభా గణన2027 కార్యక్రమంలో భాగంగా నగరంలో నిర్వహించనున్న ఇంటిగణన ప్రక్రియపై ఎన్యూమరేట్లు, సూపర్వైజర్లు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ స్కూల్, దామోదరం సంజీవయ్య మెమోరియల్ మున్సిపల్ స్కూల్, డాక్టర్ పి.జె. అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ స్కూల్‌లలో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటిగణనలో ప్రతి వివరాన్ని నిశితంగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని, సమగ్ర డేటా ఆధారంగా ప్రజలకు అవసరమైన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. నగరంలో మొత్తం 490 మంది ఎన్యూమరేట్లు, 79 మంది సూపర్వైజర్లు, 28 మంది ఫీల్డ్ ట్రైనర్లకు ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ అందిస్తున్నారని వివరించారు. ఈ నెల 15 నుండి 17 వరకు మొదటి బ్యాచ్, 21 నుండి 23 వరకు రెండో బ్యాచ్‌కు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి, సమగ్ర సమాచార సేకరణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో సెన్సస్ ఇంచార్జీ ఎస్.ఇశ్రాయోలు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, హెడ్ మాస్టర్ రెడ్డిపోగు విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



# పోలీసులను దుశ్శాలవులతో సన్మానించిన ఆలయ కమిటీ



జూపాడుబంగ్లా :ఏప్రిల్: 15: (నంది పత్రిక ) రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ తర్తురు రంగనాథ స్వామి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీస్ నిర్వహించిన పోలీస్ అధికారులకు రంగనాథ స్వామి ఆలయ కమిటీ బుధవారము సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రీ శ్రీ రంగనాథ స్వామి జాతర దిగ్విజయంగా ముగిసేందుకు పోలీసుల సహకారం మరువనానిదన్నారు. జాతరలో ఎలాంటి, గొడవలు,అసాంఘిక కార్యఫలాపాలకు ప్రజలు తావు లేకుండా నిత్యం పోలీస్ నిఘా ఏర్పాటు చేసినటువంటి నందికొట్కూరు రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తర్తూరు జాతరలో శాంతిభద్రతను కాపాడేందుకు ప్రజలు ఇచ్చిన సహకారం తోనే సాధ్యమైంది అన్నారు. జాతరకు దాదాపు 6 లక్షల మంది హాజరైన చిన్న సంఘటన కూడా జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు అందించిన సహకారం వల్లే జాతర ను విజయవంతం చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ టి. సుబ్రమణ్యం, ఎస్ఐ. కే. మల్లికార్జున ల కు చైర్మన్ మందటి నారాయణరెడ్డి టిడిపి స్థానిక నాయకులు రమణారెడ్డి,శివకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్న స్వాములు, పంచాయితీ కార్యదర్శి రాముడు, మందడి దొరబాబు రెడ్డి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీస్ అధికారులకు దుశ్శాలవులతో సన్మానించారు.



# ఇంటర్ ఫలితాల్లో మెరిసిన కేజీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు

**అత్యుత్తమ ఫలితాలతో కీర్తి**

బనగానపల్లె, ఏప్రిల్ 15: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్య మండలి నిర్వహించిన 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో బనగానపల్లె పట్టణంలోని కేజీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ కంకర రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కంకర రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరిమార్చి నెలల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి సంస్థకు మంచి పేరు తెచ్చిపెట్టారని పేర్కొన్నారు.రెండవ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో ఆర్. జమీలాబీ 976/1000 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆమె ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందినవారు. బైపీసీ గ్రూపులో ఎస్. సుహానా 935/1000 మార్కులు సాధించగా, ఆమె హుస్సేన్‌పురం గ్రామానికి చెందినది. సిఈసి గ్రూపులో ఎస్. సమీరా 876/1000 మార్కులు సాధించి నందివర్గం గ్రామానికి కీర్తి తీసుకొచ్చింది. ఈ విధంగా రెండవ సంవత్సరం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో విజయ దుందుభి మోగించారు. అదేవిధంగా మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా కళాశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ గ్రూపులో కె. జయశ్రీ 449/470 మార్కులు సాధించగా, ఆమె ఎనకండ్ల గ్రామానికి చెందినది. బైపీసీ గ్రూపులో ఎస్. అతియా సమ్రీన్ మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటింది. సిఈసి గ్రూపులో ఈ. మధులత 466/500 మార్కులు సాధించి కృష్ణగిరి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.ఈ విజయాలకు కారణమైన కళాశాల ప్రిన్సిపల్ సదాశివమూర్తి, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది కృషిని కరస్పాండెంట్ కంకర రామచంద్రారెడ్డి అభినందించారు. అలాగే విద్యార్థుల కృషితో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో కీలకమని పేర్కొంటూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కేజీఆర్ జూనియర్ కళాశాల కట్టుబడి ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పించి మంచి విద్యను అందించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తూ మరిన్ని విజయాలు సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది: ట్రంప్

ఇకపై ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపబోమని చైనా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు చైనా మద్దతు తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "ఇకపై హర్మూజ్ ను మూసి ఉంచడం జరగదు. హర్మూజ్ జలసంధిని నేను శాశ్వతంగా తెరుస్తుండటం చైనాకు చాలా సంతోషాన్నిచ్చింది. అమెరికాతో పాటు ప్రపంచం కోసం నేను ఈ పని చేస్తున్నాను. వారు ఇరాన్‌కు ఆయుధాలు పంపబోమని అంగీకరించారు" అని ఆయన రాసుకొచ్చారు.

# మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కమ్యూనిస్టులను గెలిపించాలి :సిపిఐ






**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూలు నగర సమితి శాఖ కార్యదర్శుల సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు సిపిఐ కార్యాలయంలో జరిగినది ఈ సమావేశంకి గీతా ముఖర్జీ నగర్ శాఖ కార్యదర్శి యు నాగరాజు అధ్యక్షతన సమావేశం జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కె జగన్నాథం మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్ లో గెలిచినటువంటి కార్పొరేటర్లు ఎవరైనా ప్రజా సమస్యల పైన మాట్లాడినటువంటి దాఖలాలు ఈ ఐదు సంవత్సరాలలో లేదని ఇలాంటి వ్యక్తులను గెలిపించడం ద్వారా పేద ప్రజలకు మేలు జరగడం లేదని మున్సిపల్ కార్పొరేషన్ లో కమ్యూనిస్టులు కార్పొరేటర్లుగా గెలిచి వెళ్లడం ద్వారా కార్పొరేషన్ పాలక మండలి సమావేశాలు జరిగినప్పుడల్లా ప్రజల సమస్యలపై గళం మెత్తుతారని తద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కావడానికి అధికారులు పనిచేయడానికి ఎంతో ఉపయోగపడతాదని దానికోసమే కమ్యూనిస్టులను కార్పొరేటర్లుగా గెలిపించాలని గెలిచే దానికోసం పార్టీ కార్యకర్తలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని కార్యకర్తలు పిలుపునిచ్చాడు ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడిన సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి కర్నూలు నగరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని కనీసం పేద ప్రజలు గుక్కెడు నీళ్లు తాగడానికి దొరకడం లేదు ఎండాకాలం వస్తే చాలు వారానికి ఒకసారి కూడా మంచినీళ్లు రావడం లేదు రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని గత అనేక రోజులుగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారులు కానీ అధికార పార్టీ నాయకులు గాని ఆ వైపున ఆలోచనలే చేయడం లేదు కావున రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికారం పార్టీకి తగిన బుద్ధి చెప్పేటట్లు ప్రజలు చైతన్యవంతం కావాలని చైతన్యవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు నగరంలో ఇంటి స్థలం లేని ప్రతి పేదవాడికి రెండు సెట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి ఎన్నికల ముందర ప్రజలకు ఆశ చూపి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటిదాకా ఆ ఊసే లేదు రాష్ట్ర ప్రభుత్వాన్ని కమ్యూనిస్టు పార్టీగా ఒకటే డిమాండ్ చేస్తుంది ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేయడానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని లేని పక్షంలో బాడుగ ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి అద్దె చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ఈ డిమాండ్ సాధన కోసం జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కమ్యూనిస్టులు గెలిపించడం ద్వారా మన న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడానికి సులువు అవుతుందని దానికోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు నగరంలోని శివార కాలనీలలో మున్సిపల్ వాటర్ రావడం లేదు సిసి రోడ్లు లేవు మురికి కాలవలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాధుడే లేడు కావున ఈ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శిలు డి శ్రీనివాసరావు మహేష్ నగర కార్యవర్గ సభ్యులు గిడ్డమ్మ బిసన్న నల్లన్న అన్వర్ కుమార్ భద్ర కుమార్ శాఖ కార్యదర్శి సులోచనమ్మ మునెమ్మ బువ్వమ్మ దేవి బాయ్ కోటమ్మ ధనలక్ష్మి రామాంజి నాగరత్నమ్మ ధరెన్న రంగన్న అబ్రహాం సుధాకర్ శేషమ్మ శ్రీను వెంకటేశు రాజశేఖర్ ఆశ మాలుంబి వెంకటేశ్వరమ్మ నరసింహులు అంకమ్మ ఆశ బేగం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరిసిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

## 978 మార్కులతో కావ్య మండల టాపర్

## హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు







**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 15 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మండలంలోనే అగ్రగామిగా నిలిచారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 73 శాతం, ప్రథమ సంవత్సరంలో 50 శాతం ఉత్తీర్ణత నమోదైందని, ముఖ్యంగా ఎంపీసీ విభాగంలో కావ్య 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, బైపీసీ విభాగంలో సంధ్య 956 మార్కులతో రెండో స్థానం,సునీత 937 మార్కులతో మూడో స్థానం లో, సీఈసీ విభాగంలో భార్గవి 878 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచి పాఠశాల కీర్తిని చాటారని తెలిపారు. అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 432, బైపిసిబి భాగంలో 409, సీఈసీ విభాగంలో 449 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ విజయానికి ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాలలోని క్రమశిక్షణే ప్రధాన కారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. నాణ్యమైన బోధన అందించడంలో ఉపాధ్యాయులు చూపిన చొరవ, విద్యార్థుల పట్టుదల నేడు పాఠశాలను గర్వపడేలా చేశాయని ఆయన కొనియాడారు. విజేతలను వైస్ ప్రిన్సిపాల్ రజినీ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రెండో విడత అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం

## డిఎంఎసి చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడపబ్యూరో చీఫ్ ,ఏప్రిల్ 15:నంది పత్రిక** జిల్లాలోని అర్హులైన 189 మంది జర్నలిస్టులకు రెండవ విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందనీ డిఎంఎసి చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీఎంఎస్సీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.మొదటి విడతలో 538 మంజూరు కాగా రెండో విడతలో 189 మందికి కమిటీ ఆమోదం తెలిపిందనన్నారు.ఇంకా అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం లో ఇంచార్జ్ డీఆర్వో వెంకటపతి, డిఎంఎసి కన్వీనర్ నెంబర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిని పద్మజ,డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి , అసిస్టెంట్ లేబర్ కమిషనర్, రైల్వే పీఆర్వో జనార్ధన్,బ్యూరో చీఫ్ విశాలాంధ్ర పి.రామసుబ్బా రెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ ప్రజాశక్తి నూర్ బాషా,స్టాఫ్ రిపోర్టర్ ఈ టివి జి.మురళి మోహన్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్ హెచ్ యంటివి వి.యం.చంద్ర మోహన్ రాజు,రిపోర్టర్ ఆంధ్రప్రభ ఐ.సి.సుబ్బారెడ్డి,ఎడిటర్ రాయలసీమ సమయం ఏ.సందీప్ కుమార్ రెడ్డి,ఎడిటర్ కొత్త తరంగం కె.రమేష్,స్టాఫ్ రిపోర్టర్ మహా న్యూస్ యు శ్రీకాంత్, కరస్పాండెంట్ ప్రసార భారతి బి.శ్రీనాథ్ రెడ్డి, ఫోటోగ్రాఫర్ ఆంధ్ర జ్యోతి టి.రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్ ఫలితాల్లో 85% ఉత్తీర్ణత



**వెలుగోడు, ఏప్రిల్ 15 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణ సమీపంలోని గుంతకందాల రహదారిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు.రెండో ఇంటర్ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో అల్తాఫ్ హుస్సేన్ 959 మార్కులతో టాపర్‌గా, బైపీసీ టాపర్ భవిత 980 మార్కులతో, సీఈసీ టాపర్ గాయత్రి 897 మార్కులతో ప్రతిభ కనబరిచారు.అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ 84 శాతం, బైపీసీ 92 శాతం, సీఐసీ 82 శాతం ఉత్తీర్ణత సాధించి మొత్తం మీద 85 శాతం ఫలితాలు నమోదయ్యాయని తెలిపారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ 85 శాతం, బైపీసీ 93 శాతం, సీఐసీ 78 శాతం ఉత్తీర్ణతతో మొత్తం మీద 85 శాతం ఫలితాలు సాధించినట్లు తెలుస్తోంది.విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్ల ఈ విజయాన్ని సాధించగలిగామని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

# పారుమంచాల గ్రామంలో రీ సర్వే పై ర్యాలీ, గ్రామ సభ ..

## తాసిల్దార్ వి చంద్రశేఖర్ నాయక్



**జూపాడుబంగ్లా :ఏప్రిల్: 15: (నంది పత్రిక)**భూముల రీ-సర్వేను తహశీల్దారు వి.చంద్ర శేఖర్ నాయక్ బుధవారము ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టినా రీ సర్వే ప్రాజెక్టు 5వ దశలో భాగంగా జూపాడు బంగ్లా మండలము పారుమంచాల గ్రామం లో రైతులకు రీ సర్వే పై అవగాహన కొరకు తహశీల్దారు చంద్ర శేఖర్ నాయక్ ఆధ్వర్యం లో పారుమంచాల గ్రామంలో వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సభ ఏర్పాటు చేసి రీ-సర్వే పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దారు చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ రీ-సర్వే విషయంలో వచ్చే అనుమానాలు, సందేహాలు అపోహాలు తీర్చుడానికి రీ-సర్వే గ్రామ సభ నిర్వహించడమైనది అని తెలియజేశారు. రైతులు సర్వే కు తప్పనిసరిగా తమ వద్ద గల రిజిష్టర్ డాక్యుమెంట్స్, పట్టాదారు పాసు పుస్తకములు, డీ- పట్టా, 1బి , అడంగాలు, రెండు పాస్ పోర్ట్ సైజ్ పోటోలు తో హజరై, వారు సాగు చేసే భూముల యొక్క ఖచ్చితమైన హద్దులు చూపించి సర్వే జరిపించుకుంటే చాలా వరకు సమస్యలు సమసిపోతాయి కావునా రైతులు రీ సర్వే కు ఖచ్చితంగా హాజరవ్వలని రైతులకు తెలియజేశారు.

పారుమంచాల గ్రామములో మొత్తం విస్తీర్ణము : 14260.06ఏకరములు

పట్టా భూమి: 10334.99 ఏకరములు

ప్రభుత్వ భూమి 3923.95ఏకరములు

పోరంబోకు భూమి 416.93ఏకరములు

మొత్తం ఖాతాలు: 5350

మొత్తం సర్వే నెంబర్లు :1661

భూ ఖండములు: 52 రీ సర్వే లో భాగంగా మొదట గ్రామము యొక్క సరిహద్దు ను గుర్తించి, ప్రభుత్వ భూమి సర్వే చేయడమైనది. తేదీ 15-04-2026 నుండి రైతులకు ఫారం 19 యిచ్చి రైతుల సమక్షం రీ సర్వే చేయడం జరుగుతోంది అని తెలియజేశారు. రైతులు సర్వే టీమ్ వస్తున్నప్పుడు అందరు పొలం దగ్గరకు హాజరై రీ సర్వే సక్రమంగా జరుగులాగునా సహకరించాలి అని రైతులను కోరారు. గ్రామ సభకు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, ఎన్ .నాగన్న, మండల సర్వేయర్ డి. అతీఫ్, గ్రామ రెవెన్యూ అధికారి డి. మౌల భాష, బాలకృష్ణ , గ్రామ సర్వేయర్ షామిమ్, హరికృష్ణ, గ్రామ మాజీ సర్పచ్ మాధవరం ప్రకాశం, మండల పరిషత్ అధ్యక్షురాలు, మిద్దెపోగు నీలమ్మ, గ్రామ నాయకులు వెంకట రమణ రెడ్డి, గ్రామం రెవెన్యూ సహాయకులు గ్రామ రైతులు మరియు కౌలు రైతులు పాల్గొన్నారు.




# ఉత్తమ మార్కులు సాధించడం పై హర్షం



**మద్రిపాడు ఏప్రిల్ 15నంది పత్రిక :** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ గ్రూపు నందు చుంచులూరు గ్రామానికి చెందిన కలిశెట్టి జ్ఞాపిక మండల స్థాయిలో గతంలో ఎన్నడూ లేని విధంగా 971 మార్కులు సాధించి మండలంలో ప్రధమ స్థానం దక్కించుకోవడంపై నందవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.అలాగే మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపు నందు 470 కి 455 మార్కులు సాధించిన వర్షిత,449 మార్కులు సాధించిన వినితలకు,బైపీసీ గ్రూపు నందు 440 కి 410 మార్కులు సాధించిన సంధ్యకు అభినందనలు తెలియజేశారు.

# పదోన్నతి పొందిన సూపరిండెంట్ డాక్టర్ సుజాతకు ఘన సన్మానం

**ఆళ్లగడ్డ,ప్రతినిధి ఏప్రిల్ 15నంది పత్రిక** ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ గా పని చేస్తూ పదోన్నతి పై బదిలీ పై వెలుతున్న డాక్టర్ సుజాతను బుధవారం ఆసుపత్రి వైద్యాధికార లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సుజాత మట్లాడుతూ ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో 23 సంవత్సరాలుగా పని చేశామన్నారు. ఆసుపత్రి సిబ్బంది ప్ర జలు, పట్టణ పెద్దల సహాకారం మరువలేనిదన్నారు. అనంతరం పలువురు వైద్యాధికారులు సూజాత చేసిన సేవలను కొనియాడారు. సూపరిండెంట్ సుజాతను ఆసుపత్రి వైద్యాధి కారులు మోమెంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీవో సంఘం రాష్ట్ర అసోసియెటెడ్ అధ్యకుడు దస్తగిరిరెడ్డి, వైద్యాధికారులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ముస్లింల అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యం

## ఎన్.రాఘవేంద్ర రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన మంత్రాలయం ముస్లిం సోదరులు



**మంత్రాలయం న్యూస్ :-** ముస్లిం ల అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ మాధవరం రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా మంత్రాలయం ముస్లిం సోదరులు ఎదురు చూస్తున్న షాదీ ఖానా ను రాఘవేంద్ర రెడ్డి మంజూరు చేయించడం తో బుధవారం మంత్రాలయం ముస్లిం సోదరులు రాఘవేంద్ర రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎలాంటి అభివృద్ధి కావాలంటే అలా అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీ సహయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ముస్లిం సోదరులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న షాది ఖానా మంజూరు కావడం ఆనందం గా ఉందన్నారు. షాదీఖాన ముంజూరు చేయించడం లో ఎనలేని కృషి చేసిన మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ మాధవరం రాఘవేంద్ర కుటుంబానికి ధన్యవాదాలు తెలుపుకుంటామని తెలిపారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాఘవేంద్ర రెడ్డి, మాధవరం మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, మంచాల సొసైటీ ఛైర్మెన్ రామకృష్ణ రెడ్డి లను పూల మాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వరదరాజు, ముస్లిం మత పెద్దలు గాజుల భాష, ఖాజాహుశేన్ తాత,బేల్దారు మాబ్బాష, ఇమాం ఖాజాబందేనవాజ్, పింగాణి ఖాజా, అండే బాష, షాబువలి, రఫీ, హైమత్ ఖాన్, ఇమాం సాబ్, రఫీ, చాంద్ బాషా, హజరత్, జక్రియ, మహమ్మద్ రఫీ, అండే ఖాజ, రసూల్, అల్లి, మహబూబ్, టిడిపి నాయకులు టైగర్ రఘు, శివ తదితరులు ఉన్నారు.

# డీలిమిటేషన్ పై తన వైఖరి వెల్లడించిన విజయ్

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లుపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ స్పందించారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

# బాలస్వామికి ఉత్తమ జర్నలిస్ట్ గా అంబేద్కర్ జాతీయ సేవాపురస్కారం

**పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 (నంది పత్రిక):**జర్నలిస్టు గా అనేక దినపత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో సుదీర్ఘకాలంగా30సంవత్సరాలపాటు ప్రజాసమస్యలపై ఎన్నో కథనాల ను రాసి,వాటిని అధికారులద్వారా కదలికలుతెచ్చి పరిష్కారంచూపడమేకాకుండా, ప్రజాసమస్యలపై కళంతో నిరంతరంపోరాటంచేస్తూ,మరొకప్రక్కఎరుకల,యానాదుల కుటుంబాలకు అండగానిలిచిఎన్నో సేవలు అందిస్తూ, అభాగ్యులకు నేనున్నానంటూ ఒక భరోసా ఇస్తూ తన ఫ్రేండ్స్ ప్రేరణతోపేదలకుఅభా గ్యులకు నిత్యావసర వస్తువులు అందించడమే కాకుండా, తన స్నేహితులతో కలిసి రక్త దానం చేయిస్తూ అందరికి ఆదర్శంగా నిలిచిన సీనియర్ జర్నలిస్ట్ గుడి మే బాలస్వామిచేస్తున్న సేవలను గుర్తించి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోటా మండలం విద్యానగర్ లోని ఎం. వి.ఫౌండేషన్ సేవా సంస్థ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ సేవా పురస్కారం -2026 లోభాగం గా జాతీయ ఉత్తమ సీనియర్ జర్నలిస్టు పురస్కారంఅవార్డ్ ను ఎం. వి.లీల మోహన కృష్ణ, సినీ నటి, యాంకర్, జర్నలిస్టు జ్యోతి, సినీ ఆర్టిస్టు మోహన్, కొరియోగ్రా ఫర్ టిట్లు భాయి చేతుల మీదుగా ప్రధానాత్సోవం చేశారు.కడప జిల్లా కాశినాయన మండలంఅమగంపల్లి గ్రామానికి గుడిమే బాలస్వామి 30 సంవత్సరాలనుండి జర్నలిస్ట్ గా సేవలుఅందిస్తున్నారు. అనేకదినపత్రికలలో పని చేశారు.ప్రస్తుతంఎలక్ట్రానిక్ మీడియా రంగంలో సేవలు ఇప్ప టికి అందిస్తున్నారు.కాశినాయన మండలం ఆకులనారాయణపల్లి యానాదులు సమసమాజానికి దూరంగా ఉంటూ జనాలను చూస్తే పారిపోయే వారితో స్నేహం చేసి వారి స్థితిగతులపై తన కళంతో పనిచెప్పడంతో జిల్లా అధికారుల లో కదలిక తెచ్చి వారిని సమాజాని కి దగ్గరచేసి,ఇల్లు,భూములుఇప్పిం చడంలో కీలకపాత్ర పోషించారు. రెడ్డికొట్టాల యానాదులపై ప్రత్యేక కథనాలు రాసి అప్పటి ఎమ్మెల్యే గోవిందరెడ్డినేకదిలించిఇల్లు,భూములు మంజూరు చేయించారు. వరికుంట్ల యానాదులకు ప్రభుత్వం ద్వారా భూములు మంజూరు చేయించడంలో కీలకపాత్ర పోషించారు.పేదవానికిభూసమస్యలువచ్చినా అక్కడతనకళం కుపనిపెడుతూ అందరికివెన్నుదన్నుగా నిలుస్తున్నారు.వార్తల విషయంలో ఎక్కడరాజీ అనేదిచూడడు.వీటన్నింటికిగుర్తించిన ఎం. వి.ఫౌండేషన్ సేవా సంస్థసామాజిక సేవాకార్యక్రమాలు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ సేవా పురస్కారం అందించారు.

ఈఅవార్డు నాకు మరింత బాధ్యత పెంచిం దని ఈసందర్భంగా బాలస్వామి తెలిపారు. నాకు సహకారాన్ని అందించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. .



# పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం జడ్పిటిసి ముత్యాల ప్రసాద్ కీలక సూచనలు



**పోరుమామిళ్ల,ఏప్రిల్ 15(నంది పత్రిక ):**పోరుమామిళ్ల మండలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్ పాల్గొని పలు ముఖ్య అంశాలపై మాట్లాడారు. మండల అభివృద్ధికి సంబంధించిన సమస్యలను సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా రేషన్ కార్డుల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కార్డుల్లో కొత్త పేర్లు చేర్చుకునే అవకాశమే ఉందని, కానీ అవసరం లేని పేర్లను తొలగించే అవకాశం లేకపోవడంతో చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే పోరుమామిళ్ల మండల పరిధిలోని టేకూరు పేటకు చెందిన సర్వే నంబర్ 676లో ఉన్న దళిత ఎస్సీ ఎస్టీ మైనారిటీ బిసి ల వ్యవసాయ భూముల సోలార్ కంపెనీకి అప్పగించడం సరైన నిర్ణయం కాదని ముత్యాల ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈ భూముల్లో ఇప్పటికే పలువురు రైతులు పలు రకాల పంటలు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాసీన్, ఉపాధ్యక్షులు సి. బాషా, రాజశేఖర్ చెన్ను, తహసీల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు, ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, ఎంపీటీసీలు మరియు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా పాట ఆట తోడ్పడాలి..





## నేడు కళ వ్యాపారం అయిపోయిందన్నారు..

## శ్రామికోత్సవల్లో మాజీ ఎమ్మెల్యే ఎం ఏ గఫూర్

**, నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 15 ( నంది పత్రిక )** ప్రజా ఉద్యమాలకు,కార్మిక ఉద్యమాలకు ఆట పాట తోడ్పాటు కావాలని మాజీ ఎమ్మెల్యే ఎం ఏ పూర్ అన్నారు.సీఐటీయూ రాష్ట్ర మహాసభలు సందర్భంగా నంద్యాల పట్టణలోని టౌన్ హాల్ లో ఏర్పాటు చేసిన శ్రామికోత్సవాలను సీఐటీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే ఎం ఏ గఫుర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసు రత్నం అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎం ఏ గఫుర్ మాట్లాడుతూ నేడు సినీ ప్రపంచంలో కళ వ్యాపారం అయిపోయిందని ప్రజల పక్షాన, కార్మికుల పక్షాన సినీ కళాకారులూ ఉండటం లేదన్నారు. కళ కళ కోసం కాదు ప్రజలకోసం నినాదంతో సీఐటీయూ శ్రామికోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజలకు సందేశనిచ్చే ఇచ్చే సినిమాలు కరువయ్యాయన్నారు.కష్టాజీవుల గురించి ఆలోసించే స్థితిలో సమాజం లేదు.. సమాజం అభివృద్ధిలో ఉత్పత్తి చేసే కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు.. కరోనా కష్టకాలంలో కష్టపడిన మున్సిపల్ కార్మికులకు మోడీ కళ్లు కడగడం కాదు వాళ్ళ జీవితాల్లో వెలుగులు నింపే లా వారి వేతనాలు పెంచకుండా కళ్ల కు ముక్కితే ప్రయోజనం లేదని గఫుర్ విమర్శించారు.ప్రజల సమస్యలను ఎండగడుతూ కార్మికుల ప్రజా ఉద్యమాలకు, పోరాటాలకు ఉత మిచ్చేలా కళాకారులూ కళలు ప్రదర్శించలన్నారు.సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ శ్రమను గుర్తించలేని దుస్థితి లో మన దేశంలో పాలకులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రామికులు ప్రజలు75 శాతం పౌష్టిక హారం లోపంతో అల్లాడిపోతున్నరని సిగ్గు చేటైన విషయమన్నారు.శ్రామికుల విలువను పాలకులు గుర్తించాలన్నారు.శ్రమకు గౌరవం రావాలనే నేడు సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రామిక ఉత్సకవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే. ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఏ. నాగరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

# పోరుమామిళ్ళ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ - నారిశెట్టి సుప్రజ



**పోరుమామిళ్ల ఏప్రిల్ 15 (నంది పత్రిక):**రైతు శ్రేయస్సు కోసం పనిచేస్తున్న శ్రీ నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ,రైతులకు అన్ని రంగాల్లో వెన్నుదన్నుగా ఉందన్నారు .మహిళా రిజర్వేషన్ బిల్ నారిశక్తి కోసం కృషి చేస్తున్న నరేంద్ర మోడీ గారికి మహిళల తరుపున ధన్యవాదాలు తెలిపారు . వేసవి కాలంలో పెరుగుతున్న నీటి ఎద్దడిపై తాగు నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలపై వెంటనే స్పందించాలని సూచించారు. రైతాంగానికి నీరు జీవనాడి అని పేర్కొంటూ, ప్రతి చుక్క నీటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు, అధికారులు కలిసి పనిచేస్తేనే నీటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాసీన్ , ఉపాధ్యక్షులు సి బాషా ,రాజశేఖర్ చెన్ను , తాసిల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు , ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి ఎంపీటీసీలు అన్ని శాఖల ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల నియామకంపై హర్షం

## నేతలకు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీడ్స్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి



**నందిపత్రిక -ప్యాపిలి** తెలుగుదేశం పార్టీ నూతనంగా ప్రకటించిన పొలిట్ బ్యూరో సభ్యులకు, జాతీయ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న పలువురు కీలక నేతలకు పదవులు దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా:టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన రాష్ట్ర మంత్రి శ్రీ నారా లోకేష్ కు,పొలిట్ బ్యూరో సభ్యునిగా ఎంపికైన రాష్ట్ర మంత్రి శ్రీ బి.సి. జనార్థన్ రెడ్డి కి,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా నియమితులైన శ్రీ పల్లా శ్రీనివాసరావు కు,జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నంద్యాల ఎంపీ శ్రీమతి బైరెడ్డి శబరమ్మ కు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు."పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావం కలిగిన నాయకత్వాన్ని గుర్తించి, నూతన కమిటీల కూర్పులో సామాజిక సమతూకాన్ని పాటిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం అత్యంత హర్షణీయమన్నారు. అనుభవజ్ఞులకు, యువతకు సమాన ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన ఈ కమిటీలతో పార్టీ మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఈ నూతన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియామకమైన సభ్యులందరికీ తన తరపున, కార్పొరేషన్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి





## ఎమ్మెల్యే గిత్త జయ సూర్య.

**నందికొట్కూరు ఏప్రిల్ 15( నంది పత్రిక )** వ్యవసాయం సాగు చేసుకుంటున్నా రైతన్నలకు ఉద్యానవన పంటల సాగుపై వాటి వల్ల లాభాలు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై వాటి పంటలను సాగు చేసుకునేలా రైతులకు అవగాహన పెంచాలని వ్యవసాయ ఆర్టికల్చర్ అధికారులకు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య సూచించారు. బుధవారం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయం నందు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య హాజరై పాల్గొన్నారు. అనంతరం వివిధ శాఖల తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సర్వసభ్య సమావేశంలో త్రాగునీరు, హార్టికల్చర్ పంటల సాగుపై, అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందించే పోషకాహార కార్యక్రమాలపై, రెవిన్యూ సమస్యల పరిష్కారం పై ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ రైతన్నలు ప్రతి సంవత్సరం యధావిధిగా అనుసరిస్తూ వేసుకుంటున్న పంటలను మరల వేసుకుంటూ ఉద్యానవన పంటలపై ఆసక్తి కనపరచడం లేదని పేర్కొన్నారు. తక్కువ భూమిలో అధిక ఆదాయాన్ని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఉద్యానవన పంటలకు లభిస్తుందన్న విషయాన్ని రైతుల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఆయా శాఖ అధికారులకు ఉందన్నారు. రైతన్నలు కూడా ఉద్యానవన పంటలసాగు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా వేసవి నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జల ధార కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, భూగర్భ జలాలను పెంచడమే ముఖ్య ఉద్దేశమని, అందుకు అనుగుణంగా అధికారులు చెరువులు పూడికతీత పనుల కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు అందించే పోషకాహారాలను అందించడంలో జాప్యం చేయరాదని, పోషణ్ పక్వాడ, ప్రత్యేక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో వాటిని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జిల్లాలో మూడవ స్థానంలో నియోజవర్గం నిల్చడంలో సహకరించిన అధికారులు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా మరింతగా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలను అందించడంలో ఎవరు నిర్లక్ష్యం వహించరాదన్నారు. సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని, తమ కింది స్థాయి అధికారులను పంపిస్తే అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తప్పక మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూర్, బ్రాహ్మణ కొట్కూర్ సింగిల్ విండో చైర్మన్ మూర్తు జావలి, మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ను కలిసిన శ్రీ సర్వ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్రుడు

**సిరివెళ్ల(నంది పత్రిక)** శ్రీ సర్వ లక్ష్మీ నరసింహా స్వామి టెంపుల్ సిరివెళ్లమండల పరిధిలోని నల్లమల అడవిలో గల సర్వ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించ కుండా అటవీశాఖ అధికారులను ఆదేశించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ గారిని సర్వ టెంపుల్ ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర కలెక్టర్ గారికి వినతిపత్రం అందించారు. ఆలయ పరిసరాలు ప్రహరీ గోడ టాయిలెట్ గదులు పైపులైన్ వంటి ఎటువంటి మరమ్మత్తు పనులు చేసినప్పటికీ అటవీ శాఖ అధికారులు పనులు జరగకుండా నిలిపివేస్తున్నారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర అర్జీ మేరకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.





# ప్రభంజనం సృష్టించిన గోశాల విద్యార్థి

## రైతు కూతురుకు జూనియర్ బైపీసీలో 450 మార్కులు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** ప్రభంజనం సృష్టించిన గోశాల విద్యార్థి కల్లూరు మండలానికి చిన్నటేకూర్ గ్రామానికిచెందిన కే. పి.శ్రీలక్ష్మి ణ/రా మధుసూదన్, కృష్ణవేణి కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరందీఖ్యా.జ ఫలితాలలో 455/ 450 మార్కులు సాధించినందుకు తల్లిదండ్రులు బంధువులు మిత్రులు, శ్రేయోభిలాషులు ఆనందాన్ని వ్యక్తం చేశారు మన జిల్లాకే మంచి పేరు తీసుకువచ్చిందని కొనియాడారు. గ్రామంలో ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి కలెక్టర్ రాజకుమారి



**గైర్హాజరు, నిర్లక్ష్యంపై కఠిన చర్యలు**
**ఆన్‌లైన్ హాజరు నమోదుపై**
**కలెక్టర్ ప్రత్యేక దృష్టి**
**పిజిఆర్ఎస్ ఫిర్యాదులు**
**సమయానికి పరిష్కరించాలిలి**
**పారిశుధ్యంపై గ్రామస్థుల**
**ఫిర్యాదులకు వెంటనే పరిష్కరించండి**

మహానంది ఏప్రిల్ 15 (నంది పత్రిక):– రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు గ్రామస్థులకు సమర్థవంతంగా చేరాలంటే స్వర్ణ సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురం,అబ్బీపురం గ్రామాలలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై కలెక్టర్ సమగ్రంగా ఆరా తీశారు. ముఖ్యంగా సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించి, విధులకు సమయానికి హాజరై బాధ్యతాయుతంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. హాజరు నమోదులో ఏవైనా లోపాలు, నిర్లక్ష్యం గమనించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు గ్రామస్తులతో మాట్లాడిన కలెక్టర్, సచివాలయ సిబ్బంది ప్రవర్తన, సేవల నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ సేకరించారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంచాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను నిర్లక్ష్యం చేయకుండా, నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, వెంటనే అన్ని ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కావాలంటే క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవా దృక్పథం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా, సమయానికి అందేలా ప్రతి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు

**ఆకస్మిక తనిఖీలో గైర్హాజరు సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు**
**వైద్యాధికారులపై తీవ్ర ఆగ్రహం..**
**5 గురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మహానంది ఏప్రిల్ 15 (నంది పత్రిక):– మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సమగ్రంగా ఆరా తీసిన కలెక్టర్,సిబ్బంది నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.తనిఖీ సమయంలో ఉదయం 10:10 గంటల వరకు ఇద్దరు వైద్యులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్ విధులకు హాజరు కాలేదని గుర్తించారు.అంతేకాకుండా విధులకు హాజరుకాని ముగ్గురు సిబ్బంది తరఫున ఎంపీహెచ్వో ద్వారా మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం వెలుగులోకి రావడం తీవ్రంగా పరిగణించారు.ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్, సంబంధిత ఐదుగురు సిబ్బందిపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ సేవల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.అదేవిధంగా, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని, అందువల్ల సేవలలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.




# రోడ్డు ప్రమాదాల్లో తక్షణ వైద్యంకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం-రాహత్' పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



భీమవరం:బ్యూరో చీఫ్ ఏప్రిల్ 15నంది పత్రిక . రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం–రాహత్' (పీఎం రహత్ ) పథకం ప్రాణ రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ పథకం అమలుపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంటను 'గోల్డెన్ అవర్' గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్యం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఈ నేపథ్యంలో, గోల్డెన్ అవర్‌లో బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గాయపడిన బాధితులకు ఈ పథకం కింద రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందించబడుతుందని పేర్కొన్నారు. ఈ సౌకర్యం వల్ల ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులు ఆర్థిక భారం గురించి ఆందోళన చెందకుండా, వెంటనే చికిత్స పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మరియు గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రులు ఈ పథకం అమలులో చురుకుగా పాల్గొని బాధితులకు అత్యవసర సేవలు అందించాలని ఆమె సూచించారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించడంలో సహాయం చేసే సాహసవంతులైన వ్యక్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ' గుడ్ సమారిటన్ ' పథకం అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ పథకం కింద ప్రమాద స్థలంలో సహాయం చేసి బాధితులను సమీప ఆసుపత్రికి చేర్చిన వారికి రూ. 25,000 వేల నగదు పురస్కారం అందజేయబడుతుందని తెలిపారు. గుడ్ సమారిటన్‌గా సహాయం చేసే వ్యక్తులకు ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని, వారి వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా ముందుకు వచ్చి బాధితులను రక్షించడంలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలపై స్పందన వేగాన్ని పెంచేందుకు పోలీస్, వైద్య, రవాణా మరియు అత్యవసర సేవల విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, అంబులెన్స్ సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పథకం వివరాలను గ్రామ స్థాయి వరకు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లాలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అత్యాధునిక ఐ విజన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 15నంది పత్రిక జిల్లాలో ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలను అందించేందుకు లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యాధునిక ఐ విజన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్‌ను లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్ రాజు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని భీమవరం, నరసాపురం, లంకల కోడేరు, అత్తిలి, తాడేపల్లిగూడెం, కల్వపూడి ప్రాంతాల్లో తొలి విడతలో ఏడు అత్యాధునిక ఐ విజన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సెంటర్ల ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన కంటి పరీక్షలు అందించడమే కాకుండా, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు వివరించారు. కంటి శస్త్రచికిత్స అవసరమయ్యే రోగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి పాలకొల్లు లైన్స్ విజన్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అత్తిలి, తాడేపల్లిగూడెం, భీమవరంలలో ఐ విజన్ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరమైన స్థలాలు, భవనాలు అందుబాటులో ఉన్నాయని, లంకల కోడేరు ప్రాంతంలో స్థలం అవసరమైందని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, అవసరమైన స్థలం గుర్తింపు మరియు ఇతర అనుమతుల విషయంలో జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో కంటి సంబంధిత సమస్యల నివారణకు, ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడంలో ఈ ఐ విజన్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో లైన్స్ ఇంటర్నేషనల్ ఏరియా లీడర్ ఎపి డాక్టర్ సిహెచ్ కృష్ణంరాజు, భీమవరం ఫెమిన్ లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ బి.ఐశ్వర్య, లైన్ డాక్టర్ మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..



# నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు

**జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి**



ఏలూరు బ్యూరో చీఫ్ , ఏప్రిల్, 15 నంది పత్రిక జిలాల్లో 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఇరిగేషన్ శాఖాధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' లో గ్రామాలలో చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రతిపాదనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నమయ్య జిల్లాలో అమలు జరుగుతున్న 'జలధార' కార్యక్రమం రీతిలో జిల్లాలో భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు గ్రామాలలో నీటి వనరులలో మిగులు, లోటు నీటి నిల్వలపై చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రతిపాదనల గురించి కలెక్టర్ ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించగా ఏ ఒక్కరూ సరైన సమాధానం చెప్పలేకపోవడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేకుండా ఉండేలా నీటి పరిరక్షణ కోసం 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని, అటువంటి కార్యక్రమం అమలులో అధికారుల నిర్లక్ష్యం సహించరానిదన్నారు. జలధార కార్యక్రమం ద్వారా జిల్లాలోని గ్రామంలో నీటి సంరక్షణ పనులకు సంబందించి సవివరమైన ప్రతిపాదనలను సాయంత్రం నాటికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. వీటితో పాటు ఓ అండ్ ఎం పనులకు సంబంధించి ప్రతిపాదనలు కూడా వెంటనే సమర్పించాలన్నారు. డికెన్స్ ఫార్ములాపై అవగాహన లేని జలవనరుల శాఖ ఇంజినీర్లు: వర్షపు నీటి పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గరిష్ట నీటి విడుదల అంచనా ను లెక్కించడానికి ఉపయోగించే 'డికెన్స్ ఫార్ములా ' గురించి జలవనరుల శాఖ ఇంజినీర్లను కలెక్టర్ ప్రశ్నించగా, ఒక్కరు కూడా సరైన సమాధానం చెప్పలేకపోయారు. చేసే పనిమీద సరైన అవగాహన లేకపోవడం సరైన పద్ధతి కాదని, చేసే పనిమీద పూర్తి అవగాహన కలిగి ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేలా పనితీరును మెరుగుపరచుకోవాలని ఇంజినీర్లకు కలెక్టర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేవప్రకాష్, భూగర్భ జల శాఖ డిడి కోదండరావు, ఇరిగేషన్ శాఖ ఈఈలు, డిఈలు, ఏఈ లు పాల్గొన్నారు.



# మార్చి 2026 లో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో జి.టి.ఆర్.ఎం. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల ప్రతిభ



సిరివెళ్ల (నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని ఎర్రగుంట్లకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ద్వితీయ సంవత్సరం ఊజ గ్రూపు కు చెందిన వీ.వెంకట గణేష్ 868/1000, దీూజ గ్రూప్ కు చెందిన ూ.అశ్వక్ హుస్సేన్ 945/1000, జజుజ గ్రూపుకు చెందిన పర్వేజ్ హుస్సేన్ 686/1000, ఎజుజ గ్రూప్ నుండి ఐ. దస్తగిరి 669/1000,మీూ గ్రూప్ నుంచి నాగ మధువాణి 846/1000 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరం ఊజ గ్రూప్ నుండి మహమ్మద్ ఉస్మాన్ 460/470 , దీూజ గ్రూప్ నుండి ఖ. మెహరాజ్ 445/455 , జజుజ గ్రూప్ నుండి వీ. చిన్న 396/500, ఎజుజ గ్రూప్ నుండి జు. సబిహా సుల్తానా 392/500, మీూ గ్రూప్ నుండి ూ. శ్యాంబాబు 446/500 మార్కులను సాధించారు. వీరితో పాటు మిగతా విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసులు గారు తెలియజేశారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో మర్రిపాడు కేజీబీవీ విద్యార్థినుల అద్భుత ప్రతిభ....



మర్రిపాడు ఏప్రిల్ 15నంది పత్రిక : బుధవారం వెలువడిన ఏపీ ఇంటర్మీడియట్ ఫలితాలలో మర్రిపాడు మండలంలోని కేజీబీవీ కళాశాల విద్యార్థినులు ప్రైవేట్ కళాశాలలకు దీటుగా రాణించారు. విద్యార్థినుల ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయునిల క్రమశిక్షణ నిబద్ధత కృషి అద్భుతం అని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలలో 32 మంది హాజరు కాగా 31 మంది పాస్ కాగా ఒకరు ఫెయిల్ కావడంతో 96.8% ఉత్తీర్ణత సాధించారుస్వాతి 485/500 మార్కులతో మొదటి స్థానం రాగ, ఎం .శ్రీలక్ష్మి 478/500, సిహెచ్ మేఘన 476/500 ద్వితీయ తృతీయ శ్రేణిలో నిలిచారు. సీనియర్ ఇంటర్ లో మొత్తం 32 మంది విద్యార్థినిలు హాజరుకాగ 100% ఉత్తీర్ణత సాధించారు కె .దీక్ష 974/1000 టాపర్ గా నిలవగా వి. రేనుమతి 964/1000,జి .సురేఖ 957/1000. ద్వితీయ తృతీయ శ్రేణి సాధించారు. మంచి మార్కులతో సత్తా చాటిన ఈ విద్యార్థినులను ప్రిన్సిపాల్ లక్ష్మి దేవి, తల్లిదండ్రులు,ఉపాధ్యాయునిలు, అభినందించారు.

# జిల్లాలో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు ద్వారా పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం





## యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు
## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ ఏప్రిల్ 15,నంది పత్రిక .** భీమవరం ఎస్.ఆర్.కే.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు, భూస్వాములు, రైతులతో ఎం ఎస్ ఎం ఇ పార్క్ పాలసీపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక సహాయం, విద్యుత్, నీరు, రహదారుల వంటి సదుపాయాల కల్పనపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భూయజమానులు తమ భూములను రియల్ ఎస్టేట్‌కు విక్రయించడం కంటే పారిశ్రామిక అభివృద్ధికి వినియోగిస్తే వారికి దీర్ఘకాలిక లాభాలు ఉంటాయని తెలిపారు. ఎం ఎస్ ఎం ఈ పార్కులు ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఏర్పడతాయని పేర్కొన్నారు. యువత పారిశ్రామిక రంగం వైపు దృష్టి సారిస్తే ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా, సింగిల్ విండో క్లియరెన్స్, భూవినియోగ మార్పు చార్జీలపై రాయితీలు, స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులపై సడలింపులు వంటి అనేక ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ సదుపాయాలను వినియోగించుకుని యువత పరిశ్రమల స్థాపనలో ముందుకు రావాలని కోరారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత ఆదాయం మాత్రమే సరిపోదని, ఉద్యానవన రంగాలను అభివృద్ధి చేయడం ద్వారా తలసరి ఆదాయం పెంచుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న ధాన్యాన్ని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేస్తే అదనపు ఆదాయం సాధ్యమవుతుందని సూచించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో "ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహాయక కేంద్రం" నిర్వహిస్తున్నామని, పరిశ్రమల స్థాపనకు సంబంధించి సందేహాలు ఉన్న వారు దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ( ఏపీఐఐసీ ) చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసి యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 ఎం ఎస్ ఎం ఈ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లాలో ఇస్సాకోడేరులో, నరసాపురం మండలం లికితపూడిలో ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటుకు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పార్కుల ఏర్పాటు ద్వారా సుమారు 20 లక్షల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 50కు పైగా ఎం ఎస్ ఎం ఈ పార్కులు, 38 మెగా ఇండస్ట్రియల్ యూనిట్లు ప్రారంభించబడినట్లు పేర్కొన్నారు. 'ఇంటికో పారిశ్రామికవేత్త' అనే లక్ష్యంతో యువతను పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, వ్యవసాయం మీదే ఆధారపడకుండా ఉద్యానవన రంగాలను అభివృద్ధి చేసుకుంటే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. తలసరి ఆదాయం పెరగడానికి విభిన్న రంగాల్లో అభివృద్ధి అవసరమని సూచించారు. ప్రైవేట్ భూముల్లో ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటు కోసం ప్రభుత్వం అనుమతులు, ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమల స్థాపనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత తమ ఆలోచన విధానాన్ని మార్చుకుని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యు.మంగపతి రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి హరిప్రసాద్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి అప్పారావు, ఏపీఎఐసిఐసి జడ్.ఏం, పారిశ్రామికవేత్తలు, భూస్వాములు, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.



## అంతర్జాతీయ పర్వతారోహకుడు మరియు ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ అన్మిష్ వర్మ భూపతిరాజును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు.



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 15నంది పత్రిక** భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని బుధవారం అన్మిష్ వర్మ భూపతిరాజు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా, ఆమె శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, విశాఖపట్నంలో జన్మించిన అన్మిష్ వర్మ భూపతిరాజు తన అసాధారణమైన ధైర్యం, ఓర్పు మరియు క్రీడా నైపుణ్యంతో దేశానికి గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పర్వతారోహణలో ఆయన సాధించిన విజయాలు విశేషమైనవని తెలిపారు. ఏడు అగ్నిపర్వత శిఖరాలను అత్యంత వేగంగా (92 రోజుల్లో) అధిరోహించి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. ఇదే ఫీట్‌ను గతంలో 192 రోజుల్లో పూర్తి చేసినప్పటికీ, తన సొంత రికార్డును తానే తిరగరాసిన ఘనత ఆయనదేనని అభినందించారు. అదేవిధంగా, ఏడు శిఖరాలు మరియు ఏడు అగ్నిపర్వత శిఖరాలను పూర్తి చేసిన ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. ప్రస్తుతం ఎక్స్‌ప్లోరర్స్ గ్రాండ్ స్లామ్ సాధన దిశగా కృషి చేస్తున్నారని చెప్పారు. అన్మిష్ వర్మ భూపతిరాజు సాధించిన విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని, కృషి, పట్టుదలతో ఏ లక్ష్యమైనా సాధించవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంలో లైన్స్ ఇంటర్నేషనల్ ఏరియా లీడర్ ఎపి డాక్టర్ సిహెచ్ కృష్ణంరాజు, భీమవరం ఫెమిన్ లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ బి.ఐశ్వర్య, లైన్ డాక్టర్ మహేష్ కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సోమరాజు వున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో లో బనగానపల్లె ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రతిభ



**బనగానపల్లె ఏప్రిల్ 15నందిపత్రిక** బుధవారం ప్రకటించిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బనగానపల్లె లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు మంచి ఉత్తీర్ణత సాధించారు. దింతో కళాశాల ప్రిన్సిపాల్, కారస్పాండెంట్లు విద్యార్థులను అభినందించారు.ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ రవ్వలకొండ కళాశాలలో ప్రథమ సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలకు గొప్ప పేరు తీసుకొచ్చారు సెకండ్ ఇయర్ ఎంపీసీ కే రాఘవి 980 మార్కులు ,సెకండ్ ఇయర్ బైపిసి పి జస్వంత్ యాదవ్ 967 మార్కులు, సెకండ్ ఇయర్ సిఇసి ఎం సుమశ్రీ 794 మార్కులు మరియు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం నుండి ఎంపీసీ పి కీర్తన 454లి మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తెచ్చారు.ఎస్ వి జూనియర్ కళాశాలలో రజిత ఎంపీసీ 973 సాధించినట్లు కారస్పాండెంట్ మునిస్వామి రెడ్డి తెలిపారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో వైష్ణవి ద్వితీయ సంవత్సరం ఎంపీసీ లో ప్రతిభ కనపర్చాగా షణ్ముఖ శ్రీ మొదటి సంవత్సరం బైపీసీ లో ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మొత్తం మీద ఈ ఏడాది ఫలితాల్లో ప్రభుత్వ, ప్రవేట్ కళాశాలలో విద్యార్థులు మంచి ప్రతిభ కనపర్చారు.

# జిల్లాకలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న :జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ ఏప్రిల్ 15,నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ బుధవారం అమరావతి నుండి జిల్లా కలెక్టర్లు మరియు సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక అంశాల అమలుపై సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ , డి.ఆర్.ఓ బి.శివన్నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ 22-ఏ రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, ఈ-కేవైసీ ప్రక్రియ, అలాగే జలధార జలహారతి కార్యక్రమాల అమలు పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి జిల్లాలో ఈ కార్యక్రమాలను వేగవంతంగా మరియు పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. భూ సంబంధిత రికార్డుల సవ్యమైన నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ, రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ-కేవైసీ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జలధార జలహారతి కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాల పరిరక్షణతో పాటు నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసి నిర్దేశిత లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి.ఆర్.ఓ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీ.డి డాక్టర్ కె.సి.హెచ్.అప్పారావు, జిల్లా సర్వే అధికారి జాషువా, భూగర్భ జలశాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోండి

## -ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

**ఆళ్లగడ్డప్రతినిధి , ఏప్రిల్ 15నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలంలోని గ్రామాలలో మంచి నీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోనిమండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిడిఓ నూర్జహన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి మా ట్లాడుతూ గ్రామాలలో సర్పంచ్ ల పదవీకాలం ముగిసి నందువల్ల గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలనిఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులే నీటి సమస్య రాకుండా బాధ్యత వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో నీటి సమస్య రాకుండందుకు ఎంపీడీవోతో చర్చించిప్రత్యేక నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు. . స్పెషలాఫీసర్లతో ఎప్పటికప్పుడు సమన్వయంతో సలహాలు సూచనలతో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని గ్రామాల్లోని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు డాక్టర్లు వడదెబ్బ సంబంధించి ప్రజల్లో తేవాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తే గ్రామ ప్రజలకు మండల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు అవుతుందన్నారు. తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ ఎంపిడిఓ నూర్జహాన్ మాట్లాడుతూ ఆ న్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి స్పెషల్ ఆఫీసర్లగా ఉన్న అధికారులతో ఎప్పటి కప్పుడు సూచనలు తీసుకోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నా రు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు చేయ్యాల్సిన పనులను సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి వైస్ ఎంపీపీ లు నా సారి లక్ష్మి నరసింహ ప్రసాద్,దాదా పీర్, మండల వ్యవసాయాధికారి కిషోర్ కు మార్, పంచాయతీ రాజ్ ఏఈ నరసింహుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ దస్తగిరమ్మ. ఆర్టీసీ శిఖామణి, ఏడిఏ మహేంద్ర, విద్యుత్ శాఖ ఏఈ శివశంకర్, ఏపీఓ ప్రదీప్, హౌసింగ్ ఏఈ కోండయ్య, వెలుగు గోపాల్, తదితర అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కస్తూరిబా పాఠశాల విద్యార్థినీలు

### ఎంఇసి విభాగంలో 480 మార్కులు సాధించిన తులసమ్మ



**ఆళ్లగడ్డ: ప్రతినిధి ఏప్రిల్ 15 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలలోని పెద్ద కందుకూరు గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిలు బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం ఎంఇసి విభాగంలో తులసమ్మ 500 మార్కులకు గాను 480 మార్కులు సాధించడం విశేషం. అలాగే అనూష 449 మార్కులు, జెస్సీ 413 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో చాంద్ బి 780 మార్కులు, హరిత 762 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సుందర కవిత మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థినిలు 76% ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే రెండవ సంవత్సరం ఫలితాల్లో 40% ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థినిలను సుందర కవిత అభినందించారు.

## సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు విడుదల... గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10వ తరగతి పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 93.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాది (93.66 శాతం) ఉత్తీర్ణత శాతంతో పోలిస్తే ఇది స్వల్పంగా ఎక్కువ కావడం గమనార్హం. బుధవారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేసిన ఈ ఫలితాలు బోర్డు అధికారిక వెబ్‌సైట్లతో పాటు డిజీలాకర్, ఉమంగ్ యాప్‌లలో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పరీక్షల కోసం మొత్తం 24,83,479 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 24,71,777 మంది హాజరయ్యారు. వీరిలో 23,16,008 మంది ఉత్తీర్ణత సాధించినట్లు బోర్డు వెల్లడించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో 55,368 మంది విద్యార్థులు (2.24 శాతం) 95 శాతానికి పైగా మార్కులు సాధించారు. అలాగే, 2,21,574 మంది విద్యార్థులు (8.96 శాతం) 90 శాతానికి పైగా మార్కులు పొందారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులలో 91 మంది 95 శాతం పైగా, 452 మంది 90 శాతం పైగా మార్కులు సాధించి సత్తా చాటారు. మరోవైపు, 1,47,172 మంది విద్యార్థులు (5.95 శాతం) కంపార్ట్‌మెంట్ కేటగిరీలో ఉన్నారు. వీరికి సప్లిమెంటరీ పరీక్షల ద్వారా ఫలితాలను మెరుగుపరుచుకునే అవకాశం కల్పించారు. జపాన్ నుంచి ఘనా వరకు 27 దేశాల్లో విస్తరించి ఉన్న సీబీఎస్ఈ, సకాలంలో ఫలితాలు విడుదల చేయడం ద్వారా తమ పారదర్శక, సమర్థవంతమైన పరీక్షా విధానాన్ని మరోసారి చాటుకున్నామని బోర్డు పేర్కొంది.



## సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు.

నంది పత్రిక

గురువారం 16 - 04 -2026

## మత్స్యకారుల కడుపు నింపింది కూటమి ప్రభుత్వం...

# మోసం చేసింది జగన్ ప్రభుత్వం

**మత్స్యకారుల హక్కులను కాలరాసిన జగన్ కు మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్**

**హార్బర్ల అభివృద్ధికి రాష్ట్ర వాటా ఉపయోగించకపోగా, కేంద్రం వాటా రూ.128 కోట్లను పక్కదారి పట్టించిన ఘనుడు జగన్**

**వేట నిషేధ భృతి రూ.10 వేలు నుంచి రూ.20 వేలకి పెంపు. లక్షల కుటుంబాలకు భరోసానిచ్చిన కూటమి ప్రభుత్వం**

**డీజిల్ సబ్సిడీ, పింఛన్ పెంపుతో మత్స్యకారుల ఆర్థిక భద్రత బలోపేతం**

**పెండింగ్ క్లెయిమ్స్ క్లియర్ చేసి బాధిత కుటుంబాలకు న్యాయం**

**ట్రాన్స్పాండర్లు, రీఫ్స్, హార్బర్లతో మత్స్య రంగానికి కొత్త ఊపు**

**అబద్ధాలే జగన్ రాజకీయాలు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతిబ్యూరో చీఫ్ , ఏప్రిల్ 15:నంది పత్రిక** మత్స్యకారుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం నిజంగా పని చేసింది కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో మత్స్యకారులను మాటలతో మభ్యపెట్టి వారి హక్కులను కాలరాసింది జగన్ ప్రభుత్వం అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. బుధవారం జువ్వలదిన్నె హార్బర్ వద్ద నిస్సిగ్గుగా జగన్ పచ్చి అబద్దాలు తెలిపారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి గత ప్రభుత్వంలో కేంద్రం వాటా అయిన 128 కోట్లను ఉపయోగించకుండా నిధులను పక్కదారి పట్టించారని, రాష్ట్ర వాటా కూడా మత్స్యకారుల కోసం ఉపయోగించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రం వాటా నిధులను వెంటనే కట్టాలని కేంద్రం రాష్ట్రానికి లేఖ రాసిందని, లేకపోతే ఇతర సబ్సిడీలు అమలు చేసేది లేదంటూ చెప్పటంతో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 128 కోట్ల బకాయిలను విడుదల చేసామని తెలిపారు.నేడు జగన్ నోటికి వచ్చిన అబద్ధాలు మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతిని రూ.10,000 నుండి రూ.20,000కు పెంచి, లక్షలాది కుటుంబాలకు నేరుగా ఆర్థిక భరోసా కల్పించామని చెప్పారు. ఒకే సంవత్సరంలో భారీగా రూ.242 కోట్లకు పైగా సహాయం అందించడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. మత్స్యకారుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు డీజిల్ సబ్సిడీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, వేలాది పడవలకు లీటరుకు రూ.9 సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఇచ్చిన సబ్సిడీ కంటే మెరుగైన సహాయం తాము అందిస్తున్నామని పేర్కొన్నారు. నిస్సిగ్గుగా మత్స్యకారుల ప్రమాద మరణ పరిహారాన్ని 10 లక్షలకు పెంచామని చెప్తున్న జగన్, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న మత్స్యకారుల మరణ పరిహారాలైన 2024-25లో రూ.3.15 కోట్లు చెల్లించామని, అదే విధంగా 2025-26లో రూ.5.65 కోట్లు చెల్లించామని తెలిపారు. నీ ఇష్టానుసారంగా నీ పత్రిక, నీ మనుషులు చెప్పిన మాటలను చదవటం కాకుండా నిజాలను తెలుసుకుని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత నీకు లేదా అంటూ మండిపడ్డారు. మత్స్యకారుల కుటుంబాలకు న్యాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. సామాజిక భద్రతా పింఛనును రూ.3,000 నుండి రూ.4,000కు పెంచి, వేలాది మంది మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించామని అన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే భారీ మొత్తంలో నిధులు విడుదల చేశామని తెలిపారు. మత్స్యకారుల భద్రత కోసం ట్రాన్స్పాండర్లు అమర్చడం, కృత్రిమ రీఫ్‌ల ఏర్పాటు, చేప పిల్లల విడుదల, డీప్ సీ ఫిషింగ్ పడవల పంపిణీ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి వివరించారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. జగన్ ప్రభుత్వం కేంద్ర నిధులను పక్కదారి పట్టించి మత్స్యకారులను మోసం చేసిందని ఆరోపించిన మంత్రి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.128 కోట్ల కేంద్రం వాటా బకాయిలను కేంద్రానికి చెల్లించి పారదర్శకతను నిరూపించామని తెలిపారు. నిజాలు దాచిపెట్టి అబద్ధాలు ప్రచారం చేయడం జగన్‌కు అలవాటైపోయిందని విమర్శించిన మంత్రి అచ్చెన్నాయుడు, మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మత్స్యకారుల డిమాండ్ల మేరకు 2015-16లో 8 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని, దీనికి సంబంధించిన ఇూ=లను ఔ్తాజూూ ద్వారా సిద్ధం చేయించామని మంత్రి వివరించారు. ఫేజ్-1లో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఫేజ్-2లో బుడగట్లపాలెం, పుడిమడక, కొత్తపట్నం, వొడరేవు హార్బర్లు ప్రతిపాదించబడ్డాయని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిధులతో ఆమోదించగా, ప్రస్తుతం అది పూర్తి దశకు చేరుకుందని తెలిపారు. ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, వొడరేవు హార్బర్లు 2019-20లో ఆమోదించబడినప్పటికీ, అప్పటి ప్రభుత్వం ఖీ×ణఖీ రుణాన్ని సక్రమంగా వినియోగించకపోవడంతో పనులు మందగించాయని విమర్శించారు. ప్రస్తుతం ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి కేంద్ర ప్రభుత్వం ూవీవీ్ పథకం కింద బుడగట్లపాలెం, పుడిమడక, కొత్తపట్నం హార్బర్లను ఆమోదించిందని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం రూ.3,328.48 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి జరుగుతోందని మంత్రి తెలిపారు. వీటిలో కొన్ని పూర్తి దశకు చేరుకోగా, మరికొన్ని నిర్మాణంలో వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇక 2018-19లో ముంచినీలపేట, బియ్యపుటిప్ప ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధి ప్రారంభించినప్పటికీ, 2019 నుంచి 2024 వరకు నిధుల విడుదలలో జరిగిన ఆలస్యం కారణంగా అవి పూర్తికాలేదని చెప్పారు. అలాగే 2021-22, 2022-23లో ూవీవీ్ కింద భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువు, దొండవాక, ఉప్పలంక ప్రాంతాల్లో రూ.126.91 కోట్లతో 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు ఆమోదం లభించినప్పటికీ, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదని మండిపడ్డారు. మత్స్యకారుల అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు జగన్ కు లేదని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## ఇంటర్ ఫలితాల షాక్ ఫెయిల్ కావడంతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం పరిస్థితి విషమం



**పోరుమామిళ్ళ ఏప్రిల్ 15 (నంది పత్రిక):** పోరుమామిళ్ల మండలం చిన్నాయపల్లె గ్రామానికి చెందిన బాబు అనే విద్యార్థి ఇంటర్ ఫలితాలు విడుదల కావడంతో ఫెయిల్ అయిన బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో అతని పరిస్థితి విషమించడంతో, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు గురై రోదనలు మిన్నంటాయి. ఆసుపత్రి ప్రాంగణంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మిని వివరణ కోరగా, విద్యార్థి తీసుకున్న పాయిజన్ అత్యంత ప్రమాదకరమైనదని, రిమ్స్‌కు తరలించే వరకు అవసరమైన ఇంజక్షన్లు, మెడిసిన్లు అందుబాటులో ఉంచామని, ప్రస్తుతం పరిస్థితి తీవ్రమైనదిగా ఉందని తెలిపారు.



## మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

### రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన

### పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తున్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజులపాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

### దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటిఆర్ హెచ్చరిక

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.



# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఒక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com